


SHIVA SURYA TELUGU DAILY
# శివసూర్య
తెలుగు దిన పత్రిక
RNI APTEL : 2023/88704

శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్ : బి. శివరాముడు
9494741301, 9346185399.

కర్నూలు సంపుటి : 04, సంచిక : 19 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/ మంగళవారం - 29 - సెప్టెంబర్ - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## ఆయుధాలు కొంటారా?.. జిన్‌పింగ్‌ను నేరుగా అడిగిన ట్రంప్!




అమెరికా ఆయుధాలు కొంటారా? అని అడిగిన ట్రంప్

ఈ విషయాన్ని వెల్లడించిన చైనాలో అమెరికా రాయబారి డేవిడ్ పెర్డ్యూ

అమెరికా చట్టం ప్రకారం చైనాకు ఆయుధాలు అమ్మడంపై నిషేధం

చైనాకు ఆయుధాలు అమ్మే ప్రణాళిక లేదన్న వైట్ హౌస్

## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు




ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు

నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు

ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు

నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిగా నిషేధం

ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉండనున్న నిబంధనలు

ఢిల్లీ: ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు




## చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలి

- చిత్తూరు జిల్లాలో మరోసారి ఏనుగుల సంచారం.. అధికారులను అప్రమత్తం చేసిన పవన్ కళ్యాణ్
- ఆపరేషన్ కోసం ముసలమడుగు నుంచి కుంకీ ఏనుగులను తీసుకురావాలని సూచన
- పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం
- మానవ-ఏనుగు ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం

## అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు.. పూర్తి షెడ్యూల్ ఇదే!




- అక్టోబరు 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండోసారి బ్రహ్మోత్సవాల నిర్వహణ
- అక్టోబరు 16న గరుడ వాహనం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం
- ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరగనున్న ఉత్సవాలు
- వాహన సేవల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన టీటీడీ

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్..
# 372 కుటుంబాలకు నెరవేరిన సొంతింటి కల

### మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో 372 మందికి పట్టాల పంపిణీ

- ★ 'కుంచనపల్లిలో లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన మంత్రి నారా లోకేశ్
- ★ నియోజకవర్గంలో 80 శాతం పట్టాల సమస్య పరిష్కారమైందన్న మంత్రి
- ★ రెండు విడతల్లో రూ.2 వేల కోట్ల విలువైన భూములకు శాశ్వత హక్కులు
- ★ ఎన్నికల హామీ మేరకు దీర్ఘకాలిక సమస్యకు లోకేశ్ పరిష్కారం



అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో హామీని నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండలం కుంచనపల్లిలో 372 మంది లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. శ్రీ శ్రీనివాస కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రభుత్వ భూముల్లో చాలాకాలంగా మిగతా 2 లో




## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం

మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం

# ఏపీలో కూల్ కూల్.. తెలంగాణలో హాట్..హాట్

- తెలుగు రాష్ట్రాల్లో విభిన్న వాతావరణ పరిస్థితులు
- బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో.. ఏపీలో చల్లని వాతావరణం
- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి
- రాగల 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది



అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో.. ఏపీలో చల్లని వాతావరణం ఉండగా.. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఎండలు వేసవిని మిగతా 2 లో

# 'మన్ కీ బాత్'లో ఉసిరిపై ప్రధాని ప్రశంసలు..

### ఆరోగ్యంతో పాటు ఆదాయానికి మార్గం!

'మన్ కీ బాత్'లో ఉసిరిని సూపర్‌ఫుడ్‌గా అభివర్ణించిన ప్రధాని మోదీ

ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఉసిరి పరిశ్రమ విజయవంతమైందని వెల్లడి

మహిళా స్వయం సహాయక బృందాల ఆదాయం పెరిగిందన్న ప్రధాని

పోషకాహార లోపాన్ని తగ్గించడంలో ఉసిరి కీలకమని వ్యాఖ్య

'ఓకల్ ఫర్ లోకల్' నినాదానికి ఉసిరి సాగు ఊతమిస్తుందని పిలుపు



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' తాజా ఎపిసోడ్‌లో భారతీయ సంప్రదాయ ఫలం ఉసిరిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉసిరికాయను ఒక 'సూపర్‌ఫుడ్'గా అభివర్ణించిన మిగతా 2 లో




## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన
- స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం

## బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివైతే..
# పోలీసుల పహారా ఎందుకు?

### 420 హామీలు ఇచ్చి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

- రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు భూములు తీసుకుంటున్నారు
- ఇందిరమ్మ రాజ్యం అంటే.. పెద్దల భూములు ముట్టకుండా పేదల భూములు తీసుకోవడమా?
- ఈ పేదల తరపున పోరాడేందుకు బీఆర్ఎస్ ఉంది
- భూములు కొనడం.. అమ్మడమే.. రేవంత్‌రెడ్డికి తెలిసిన ఏకైక విద్య




హైదరాబాద్: బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివే అయితే.. పోలీసుల పహారా ఎందుకని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. 420 హామీలు ఇచ్చి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి..మిగతా 2 లో

## కాంగ్రెస్ కసరత్తు.. ఎమ్మెల్సీ స్థానాలు ఎవరికి?




- రెండు స్థానాల పదవీకాలం 2027 మార్చిలో ముగియనుంది
- గవర్నర్ కోటా మూడు స్థానాల పదవీకాలాలు నవంబర్‌లో ముగియనున్నాయి
- ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పున మొత్తం ఆరుగురు పేర్లతో పీసీసీ జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం
- అభ్యర్థుల ఎంపికలో ప్రధానంగా సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం

### కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..
## నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

ఢిల్లీ: ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## ఏపీలో కూల్ కూల్.. తెలంగాణలో హాట్..హాట్



అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో.. ఏపీలో చల్లని వాతావరణం ఉండగా.. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఏపీలో పలుచోట్ల మేఘావృతమై ఉండగా.. నిజామాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో భానుడు భగభగమంటున్నాడు. బంగాళాఖాతంలో మయన్మార్-అండమాన్ మధ్య వాయుగుండం ఏర్పడినట్లు వాతావరణశాఖ తెలిపింది. రాగల 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది. ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కి 580 కి.మీ దూరంలో తూర్పు ఈశాన్యంగా కేంద్రీకృతమై ఉత్తర వాయవ్యంగా బంగ్లాదేశ్ వైపు పయనిస్తోంది. 72 గంటల్లో ఈశాన్య బంగాళాఖాతం-బంగ్లాదేశ్ మధ్య ఇది తీరం దాటే అవకాశముంది. వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. గంటకు 30-40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవలే బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ఏర్పడి కళింగపట్నం వద్ద తీరం దాటిన సంగతి తెలిసిందే. దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. మరోవైపు ఇటీవల వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోనూ పలు చోట్ల వర్షాలు కురవగా.. తాజాగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణం కన్నా మూడు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాధారణం కన్నా నాలుగు డిగ్రీలు అధికంగా ఉన్నాయి. నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో 35 డిగ్రీలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 31.8 డిగ్రీలు సాధారణం కాగా.. ఆదివారం 34 డిగ్రీలు నమోదైంది. రానున్న రెండు రోజుల్లో మరో రెండు డిగ్రీలు పెరిగే అవకాశముందని.. ఎల్‌నినో (జుశ్రీ చీఱఅశీ) ప్రభావమే దీనికి కారణమని వాతావరణశాఖ తెలిపింది.

## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత



హైదరాబాద్: తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది. ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## 8 వేల ఎకరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

హైదరాబాద్: సిరిసిల్లలో భారాస నాయకులు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన నిరాధార ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈనెల 30న సిరిసిల్లకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో.. ప్రజలు అడుగుతున్న పలు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని పేర్కొంటూ ఆదివారం కేటీఆర్ పలు ప్రశ్నలతో కూడిన బహిరంగలేఖ విడుదల చేశారు. “కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు పూర్తయిన తర్వాత తొలిసారిగా సిరిసిల్లకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్వాగతం. అయితే ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లకు వస్తున్నందున రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలు కాకుండా ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాలి. 2014 నుంచి 2023 డిసెంబరు వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూమి మాత్రమే పంపిణీ జరిగింది. అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో కేవలం 204 ఎకరాలు మాత్రమే పంపిణీ చేశాం. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా రైతుల అభ్యర్థనల మేరకు, అర్హత ప్రకారం రికార్డులు సవరించాం. మరి 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది? అందులో 2,400 ఎకరాలు ఏ భూమి? ఏ మండలం? ఏ గ్రామం? ఏ సర్వే నంబరు? ఎవరి పేరుపై ఉంది? అనే పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలి. ఆరోపణలు రుజువు చేయలేకపోతే.. సిరిసిల్ల ప్రజలకు ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నేతన్నల రూ.60 కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు? రైతుబంధు బకాయిలు ఎప్పుడిస్తారు? సిరిసిల్లకు అదనంగా ఎన్ని టన్నుల మార్కెట్ గోదాములను మంజూరు చేస్తారు? మల్కపేట నుంచి అప్పర్ మానేరు వరకు నీరు ఎప్పుడు ఇస్తారు? జిల్లాలో చెరువుల అభివృద్ధికి, చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ఎన్ని కోట్లు కేటాయిస్తారు? సిరిసిల్లలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ఎన్ని కోట్లు మంజూరు చేస్తారు? మొత్తంగా సిరిసిల్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి” అని కేటీఆర్ పేర్కొన్నారు.

### యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ..
## అక్టోబర్ 15 నుంచి అమలు

ఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

### కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% ‘మర్చంట్ డిస్కౌంట్ రేట్’ (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

### ఎవరికి మినహాయింపు?

వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం. యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా-ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది. అత్యావసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

### ఇది పన్ను కాదు, సెటిల్‌మెంట్ ఫీజు: కేంద్రం

కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ, ఈ కొత్త ఛార్జీల వల్ల దాదాపు 96% మర్చంట్ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను కాదని, కేవలం పేమెంట్ సిస్టమ్‌లో భాగమైన ఒక సెటిల్‌మెంట్ ఫీజు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరని ఆయన వివరించారు. ప్రస్తుతం స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, కేంద్రం ఇచ్చే వివరణ అనంతరం సుప్రీంకోర్టు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది.

### ‘తాయ్ మామన్’ పథకానికి శ్రీకారం..
## మేనమామలా మారిన సీఎం విజయ్

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో ‘తాయ్ మామన్’ గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు. బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్ఛరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు. అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

## ఎల్ నినో ఎఫెక్ట్: తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల మేర ఎక్కువగా రికార్డవుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రజలు అకాల వేడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గరిష్ఠంగా 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు అధికం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు కాగా, హైదరాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రత 31.8 డిగ్రీలకు బదులుగా ప్రస్తుతం 34 డిగ్రీలుగా నమోదవుతోంది. ఎల్ నినో ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

అమరావతి: బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది. మయన్మార్, అండమాన్ దీవుల సమీపంలో ఏర్పడిన ఈ వాయుగుండం, ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కు 580 కిలోమీటర్ల దూరంలో తూర్పు-ఈశాన్య దిశలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా బంగ్లాదేశ్ వైపు కదులుతోంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి, సుమారు 72 గంటల్లో బంగ్లాదేశ్ తీరాన్ని తాకవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ వాయుగుండం ప్రభావంతో ప్రభావిత ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవలే ఉత్తరాంధ్ర తీరంలో కళింగపట్నం వద్ద ఒక తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టం జరిగిన నేపథ్యంలో తాజా హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్..
## 372 కుటుంబాలకు నెరవేరిన సొంతింటి కల

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో హామీని నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నారు. ‘మన ఇల్లు-మన లోకేశ్’ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండలం కుంచనపల్లిలో 372 మంది లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. శ్రీ శ్రీనివాస కన్వెన్షన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రభుత్వ భూముల్లో చాలాకాలంగా నివసిస్తున్న పేదలకు శాశ్వత హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దాదాపు 80 శాతం పట్టాల సమస్యను ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు. మిగిలిన కేంద్ర ప్రభుత్వ భూముల సమస్యల పరిష్కారం కోసం సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం పేదల దశాబ్దాల కలను నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు రెండు విడతలుగా పట్టాల పంపిణీ పూర్తి చేశారు. తొలి విడతలో 3,002 మందికి, రెండో విడతలో 2,634 మందికి పట్టాలు అందజేశారు. ఈ రెండు విడతల్లో కలిపి సుమారు రూ. 2 వేల కోట్ల విలువైన భూములకు ఉచితంగా శాశ్వత హక్కులు కల్పించారు. అటవీ, ఇరిగేషన్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని భూముల సమస్యలను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మంత్రి లోకేశ్ ఈ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేస్తున్నారు.

### ‘మన్ కీ బాత్’లో ఉసిరిపై ప్రధాని ప్రశంసలు..
## ఆరోగ్యంతో పాటు ఆదాయానికి మార్గం!

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం ‘మన్ కీ బాత్’ తాజా ఎపిసోడ్‌లో భారతీయ సంప్రదాయ ఫలం ఉసిరిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉసిరికాయను ఒక ‘సూపర్‌ఫుడ్’గా అభివర్ణించిన ఆయన, ఇది రుచికి రుచిని, ఆరోగ్యానికి ఆరోగ్యాన్ని అందిస్తుందని కొనియాడారు. కేవలం ఆరోగ్య ప్రయోజనాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడంలో ఉసిరి కీలక పాత్ర పోషిస్తోందని ఆయన వివరించారు. ఈ స్థానిక ఫలాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు పౌష్టికాహార భద్రతను కూడా బలోపేతం చేయవచ్చని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాను ప్రధాని మోదీ ఉదాహరణగా చూపించారు. ఈ ప్రాంతానికి ఉసిరితో శతాబ్దాల అనుబంధం ఉందని, ప్రస్తుతం ‘ఒక జిల్లా - ఒక ఉత్పత్తి’ (ఓడీఓపీ) పథకం కింద ఇక్కడి ఉసిరి పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రతాప్‌గఢ్‌లో దాదాపు 100 ఉసిరి ప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని, వీటిలో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. దేవ్‌గఢ్ కమాసీ గ్రామంలోని సావిత్రి పూలే స్వయం సహాయక బృందం ఉసిరితో క్యాండీ, మురబ్బా, జ్యూస్ వంటివి తయారు చేస్తోందని, వింధ్యవాసిని బృందం పచ్చళ్లు, జీర్ణశక్తిని పెంచే పొడులను ఉత్పత్తి చేస్తోందని మోదీ ఉదహరించారు. ప్రభుత్వ సహకారంతో యంత్రాలు, రుణాలు, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల ఈ మహిళల ఆదాయం గణనీయంగా పెరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉసిరిలో ఉండే పోషక విలువల గురించి కూడా ప్రధాని మాట్లాడారు. నారింజ పండుతో పోలిస్తే ఉసిరిలో అనేక రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుందని శాస్త్రీయంగా నిరూపితమైందని గుర్తుచేశారు. విటమిన్ సి తో పాటు యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ఇతర సూక్ష్మ పోషకాలు ఉసిరిలో పుష్కలంగా ఉంటాయన్నారు. దీనిని రోజూవారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు, జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని, చర్మం, జుట్టు ఆరోగ్యం కూడా బాగుంటుందని పేర్కొన్నారు. రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలోనూ ఉసిరి సహాయపడుతుందని ప్రధాని వివరించారు. మన ఇళ్లలో ఊరగాయలు, మురబ్బా, చ్యవన్‌ప్రాశ్ వంటి రూపాల్లో ఉసిరిని ఎప్పటినుంచో వాడుతున్నామని, ఈ సంప్రదాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని కోరారు. ఉసిరి వంటి స్థానిక సూపర్‌ఫుడ్‌లను ప్రోత్సహించడం ‘ఓకల్ ఫర్ లోకల్’ నినాదానికి నిజమైన స్ఫూర్తినిస్తుందని అన్నారు. తక్కువ ధరకే లభించే ఇలాంటి పోషకాహారం ద్వారా దేశంలో పోషకాహార లోపాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని, తద్వారా ఆరోగ్యవంతమైన, స్వావలంబన కలిగిన భారతదేశాన్ని నిర్మించవచ్చని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

### ఆయుధాలు కొంటారా?..
## జిన్‌పింగ్‌ను నేరుగా అడిగిన ట్రంప్!

ఢిల్లీ: ‘అమెరికా ఆయుధాలు కొనుగోలు చేస్తారా?’ అంటూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేరుగా అడిగేశారు. ఈ విషయాన్ని చైనాలో అమెరికా రాయబారి డేవిడ్ పెర్డ్యూ వెల్లడించారు. ‘ఫాక్స్ న్యూస్ సండే’ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని బయటపెట్టారు. చైనా అధ్యక్షుడిని వాషింగ్టన్‌లో పర్యటించాల్సిందిగా ట్రంప్ ఆహ్వానించిన కొన్ని రోజులకే ఈ విషయం బయటకు రావడం గమనార్హం. ఈ విషయంపై పెర్డ్యూ మాట్లాడుతూ “అధ్యక్షుడు ట్రంప్ ఎప్పుడూ చెబుతుంటారు, మనం ప్రపంచవ్యాప్తంగా ఇతరులకు ఆయుధాలు అమ్ముతామని. ఒకసారి ఆయన చైనా అధ్యక్షుడిని, ‘మీరు కొన్ని కొనాలనుకుంటున్నారా?’ అని అడిగారు” అని వివరించారు. తైవాన్‌కు అమెరికా ఆయుధాలు అమ్మే విషయంపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తైవాన్‌కు 14 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల ప్యాకేజీ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉంది. గత డిసెంబర్‌లో కూడా ట్రంప్ 11.1 బిలియన్ డాలర్ల ఆయుధాలను తైవాన్‌కు అమ్మేందుకు అనుమతించారు. అయితే, అమెరికా చట్టం ప్రకారం చైనాకు ఆయుధాలు అమ్మడంపై పూర్తి నిషేధం ఉంది. ఈ నేపథ్యంలో వైట్ హౌస్, స్టేట్ డిపార్ట్‌మెంట్ వెంటనే స్పందించాయి. చైనాకు ఆయుధాలు అమ్మే ప్రణాళిక గానీ, అటువంటి ఆఫర్ గానీ ఏదీ లేదని స్పష్టం చేశాయి. మరోవైపు, తైవాన్ విషయంలో ట్రంప్ విధానంలో ఎలాంటి మార్పు లేదని, ఆయన వైఖరి బలంగా ఉందని పెర్డ్యూ పేర్కొన్నారు. అయితే ట్రంప్ ఆఫర్‌కు జిన్‌పింగ్ ఎలా స్పందించారన్న వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

## చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలి

అమరావతి: చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురిచేస్తున్న ఏనుగుల గుంపును వెంటనే అడవిలోకి సురక్షితంగా మళ్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సోమవారం పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత 15 రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏనుగులు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్‌లోకి ప్రవేశించగా, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏనుగుల సంచారం వల్ల పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మానవ-ఏనుగు ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. “ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలు, హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం నిఘా ఉంచి, ప్రమాదం పొంచి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి” అని ఆయన స్పష్టం చేశారు. ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకుంటూనే, ఏనుగులను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రత, పంటల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఉద్ఘాటించారు.

### బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివైతే..
## పోలీసుల పహారా ఎందుకు?

హైదరాబాద్: బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివే అయితే.. పోలీసుల పహారా ఎందుకని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. 420 హామీలు ఇచ్చి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు భూములు తీసుకుంటున్నారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా బహదూర్‌గూడకు చెందిన రైతులతో తెలంగాణ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు భూములు కోల్పోయే రైతులతో మాట్లాడారు. “బహదూర్‌గూడ రైతుల సమస్య గతంలో కేసీఆర్ దృష్టికి తెచ్చిఉంటే.. 10 నిమిషాల్లో పరిష్కరించేవారు. ఇందిరమ్మ రాజ్యం అంటే.. పెద్దల భూములు ముట్టకుండా పేదల భూములు తీసుకోవడమా? బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో పేదల భూములు కొల్లగొడితే ఊరుకునేది లేదు. ఈ పేదల తరపున పోరాడేందుకు బీఆర్‌ఎస్ ఉంది. భూములు కొనడం.. అమ్మడమే.. రేవంత్‌రెడ్డికి తెలిసిన ఏకైక విద్య. ఫార్మాసిటీకి సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇస్తామని గతంలో అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఫార్మాసిటీ భూములు తిరిగి ఎందుకు ఇవ్వలేదు?” అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కసరత్తు.. ఎమ్మెల్సీ స్థానాలు ఎవరికి?



హైదరాబాద్: తెలంగాణలో ఖాళీ కానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు ముమ్మరం చేసింది. వరంగల్-ఖమ్మం-నల్గొండ, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయబోయే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పీసీసీ చేపట్టింది. ఈ రెండు స్థానాల పదవీకాలం 2027 మార్చిలో ముగియనుంది. ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పున మొత్తం ఆరుగురు పేర్లతో పీసీసీ జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ జాబితాను పీసీసీ అధ్యక్షుడు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు పంపినట్లు తెలుస్తోంది. వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురి పేర్లను ప్రతిపాదించగా.. అభ్యర్థి ఎంపిక బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అప్పగించినట్లు సమాచారం. అదే విధంగా హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానానికి అభ్యర్థి ఎంపిక బాధ్యతను మంత్రి దామోదర్ రాజనర్సింహకు అప్పగించినట్లు తెలుస్తోంది. అభ్యర్థుల ఎంపికలో ప్రధానంగా సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు త్వరలో ఖాళీ కానున్న గవర్నర్ కోటాలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలను కూడా కలిపి సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేసేలా అభ్యర్థుల ఎంపిక చేపట్టనున్నట్లు తెలుస్తోంది. గవర్నర్ కోటా మూడు స్థానాల పదవీకాలాలు నవంబర్‌లో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎలాంటి సామాజిక సమీకరణాలు ఉండాలన్న దానిపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై తీసుకునే నిర్ణయాన్ని బట్టి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విషయంలోనూ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సెప్టెంబర్ 29న ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానం కీలక సమావేశం నిర్వహించి అభ్యర్థులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఓటర్ల జాబితా పునఃసిద్ధీకరణ ప్రక్రియకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. నవంబర్ 6 వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. దీంతో అధిష్టానం తీసుకునే తుది నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు.. పూర్తి షెడ్యూల్ ఇదే!

తిరుపతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు విడుదల చేశారు. ఇటీవలే టీటీడీ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దసరా బ్రహ్మోత్సవాలకు సన్నద్ధమవుతోంది. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడేళ్లకోసారి వచ్చే అధికమాసం కారణంగా ఈ ఏడాది స్వామివారికి రెండోసారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కన్యామాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయతీ. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవని టీటీడీ స్పష్టం చేసింది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 16న అత్యంత కీలకమైన గరుడ వాహన సేవ, అక్టోబరు 19న స్వర్ణరథం, అక్టోబరు 20న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

సాధారణంగా ఉదయం వాహన సేవలు 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి.



అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు కన్నుల పండువగా జరగనుంది.

నవరాత్రి బ్రహ్మోత్సవాల వాహన సేవల పూర్తి షెడ్యూల్:

అక్టోబరు 11: అంకురార్పణం (రాత్రి 7 నుంచి 9 గంటల వరకు), అక్టోబరు 12: బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 13: చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 14: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపుపందిరి వాహనం (రాత్రి 7 గంటలకు),, అక్టోబరు 15: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 16: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6:30 గంటలకు), అక్టోబరు 17: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 18: సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 19: స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు), అక్టోబరు 20: చక్రస్నానం (ఉదయం 6 గంటలకు), అక్టోబరు 20వ తేదీ ఉదయం జరిగే చక్రస్నానంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

## ఆరు నెలలుగా నిలిచిపోయిన రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

---జిల్లా బీజేపీ నాయకులు



మెళియాపుట్టి/శ్రీకాకుళం, శివ సూర్య,సెప్టెంబర్ 28: జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు సూచనల మేరకు జిల్లా బీజేపీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ ని కలిసి పాతపట్నం నుంచి చంగుడి -- సరాలి మీదుగా మెళియాపుట్టి మండలంలో మాకనపల్లి జంక్షన్ దగ్గర ఆల్ ఆంధ్ర రోడ్డుతో కలిసే రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రహదారిని తవ్వి, మెటల్ వేసిన అనంతరం కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారని, ఆరు నెలలు దాటినా రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, సంబంధిత శాఖల ద్వారా రోడ్డు పనుల పరిస్థితిని పరిశీలించి, పంచాయతీరాజ్ శాఖ నిధులు మంజూరై ఉంటే వాటి ద్వారా గానీ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పరిధిలోకి వస్తే ఆ పథకం ద్వారా గానీ నిధులు మంజూరు చేసి, రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 5.5 లక్షల రూపాయలు చెక్ లను బాధితలకు అందించిన ఎమ్మెల్యే ఎంజీఆర్





మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 28 పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. హిరమండలం మండలం గులుమూరు గ్రామానికి చెందిన ఉట్ల జ్యోతి ప్రకాష్ ,అంబావిల్లి గ్రామానికి చెందిన లకలాపు సూర్యనారాయణ, శైలజ దంపతుల కుమారుడు దీక్షిత్ ఇటీవలే వైద్యం చేయించుకొని వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతు పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు వద్ద విన్నవించుకోగా ముఖ్యమంత్రి సహాయానిదికి దరఖాస్తు చేపించి ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 5,42,893 /-రూపాయిలు చెక్ లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని తెలియజేశారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎంఆర్ఎఫ్ నిధులు అందిస్తున్నారు. అలాగే ఈ నియోజకవర్గంలో గత పాలకులు ఏరోజైనా సీఎం సహాయనిది కోసం ఒక్క దరఖాస్తు అయిన చేయలేదని నియోజకవర్గ ప్రజలకు గుర్తు చేశారు.రి

## చెప్పే మాటలకన్నా.. చేసే చేతలే మిన్న!

– సంకల్పం తీసుకున్న మూడో రోజే గోమాత సేవలో గుజ్జుల గౌరీశ్వర నాయుడు



కర్నూలు,శివసూర్య, సెప్టెంబర్ 28:గోమాత సంరక్షణ సంకల్పంతో ముందుకు సాగుతున్న గుజ్జుల గౌరీశ్వర నాయుడు సంకల్పం తీసుకున్న మూడో రోజునే నందికొట్కూరు సమీపంలోని మిద్దూరు రోడ్డులో అల్వాల కిషోర్ కుమార్ నిర్వహిస్తున్న శ్రీకృష్ణ గోశాలను సందర్శించి గోమాతలకు దాణా పెట్టి సేవ చేశారు. ఈ సందర్భంగా గుజ్జుల గౌరీశ్వర నాయుడు కుటుంబ సభ్యులు, నితీష్ మెడికల్ షాపు యజమాని మాలే రాజేష్ దంపతులు, గోశాల నిర్వాహకులు అల్వాల కిషోర్ కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో గోమాతలకు పూజలు నిర్వహించారు. గోమాత సంరక్షణ ప్రతి





ఒక్కరి బాధ్యత అని గుజ్జుల గౌరీశ్వర నాయుడు అన్నారు. గోశాల నిర్వాహకులు అల్వాల కిషోర్ కుమార్ మాట్లాడుతూ, అవసరమైన చిన్నారులకు ఉచితంగా ఆవుపాలు అందించడంతో పాటు, ఆవులను పెంచుకోవాలనే ఆసక్తి ఉన్న రైతులు, పశుపోషకులకు ఉచితంగా ఆవులు అందించబడునని తెలిపారు. పండుగలు, పుణ్యదినాల్లో అవసరమైన వారికి గోమయం, గోమూత్రం ఉచితంగా పంపిణీ చేస్తామని వెల్లడించారు.

## నేటి బాలలే - రేపటి పౌరులు

సమస్యలు గుర్తించి అధికారులకు వినతిపత్రం అందించిన బాబు జగజీవన్ రామ్ బాలల పార్లమెంట్ సభ్యులు



తుళ్లూరు,శివసూర్య, సెప్టెంబర్ 28:తుళ్లూరు మండలం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం లంకలో ది28-09-2026 న ఉన్న బాబు జగజ్జీవన్ రామ్ బాలల పార్లమెంట్ గ్రూప్ సమావేశం జరిగింది,ఈ సమావేశంలో పిల్లలు గుర్తించిన సమస్యలు గురించి సచివాలయం సిబ్బందికి వినతి పత్రం అందించటం జరిగినది.ఈ సమావేశంలో తాళ్లాయపాలెం లంకలో కొన్ని సమస్యలను పిల్లలు గుర్తించి ఆ సమస్యల గురించి సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.ముఖ్యంగా లంకలో మురుగు కాలవలు లేకపోవడం వలన మురుగు నిలిచి దోమలు ఎక్కువగా ఉన్నాయని,బ్లీచింగ్ చల్లించాలని, వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, 104 సర్వీస్ అందుబాటులో ఉండడం లేదని, తల్లికి వందనం కొంతమంది పిల్లలకు రాలేదని,వరదలు వచ్చినప్పుడు వలస వెళ్లడం జరుగుతుందని, ఈ సమస్యల గురించి విన్నవించడం జరిగినది. పిల్లలకు ఇలాంటి మంచి విషయాలు నేర్పించి, సమాజం పట్ల బాధ్యతా భావం మరియు గౌరవ భావాలు కలిగేలా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం గొప్ప విషయమని గ్రామ ప్రజలు గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ సేవలను అభినందించారు.ఈ విషయాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని సచివాలయం సిబ్బంది హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది పి అనిల్ కుమార్, సచివాలయ సిబ్బంది, బాబు జగజీవన్ రామ్ బాలల పార్లమెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సేవలతో తల్లీబిడ్డలకు భరోసా - సూపర్వైజర్ గుణశేఖరమ్మ



నందవరం, శివసూర్య, సెప్టెంబర్ 28:అంగన్వాడి సేవలతో తల్లి బిడ్డలకు భరోసా కలుగుతుందని సూపర్వైజర్ గుణశేఖరమ్మ తెలిపారు.నందవరం అంగన్‌వాడీ కేంద్రం-3లో 'అంగన్‌వాడీ ఉత్సవం' కార్యక్రమాన్ని ఆమె ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లులు, చిన్నారుల ఆరోగ్యం,పోషణ,విద్యాభివృద్ధిపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించడమే అంగన్‌వాడీ ఉత్సవం ప్రధాన ఉద్దేశమన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు అంగన్‌వాడీ ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవ సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఐసీడీఎస్ ఎమ్మిగనూరు ప్రాజెక్టు పరిధిలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు



పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతో పాటు తల్లుల ఆరోగ్య సంరక్షణపై సూచనలు అందిస్తామని తెలిపారు.పిల్లలు,గర్భిణులకు నిర్ణీత సమయంలో టీకాలు వేయించుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తామన్నారు.మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ విద్య ద్వారా చిన్నారుల్లో మానసిక,శారీరక,సామాజిక అభివృద్ధికి అవసరమైన పునాది వేస్తున్నామని గుణశేఖరమ్మ తెలిపారు.పిల్లల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమాజ భాగస్వామ్యంతో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి తల్లీబిడ్డలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని 29 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు,చిన్నారులు,గర్భిణీలు పాల్గొన్నారు.

## పిఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సావాది రఘునాథ్ ఎన్నిక..



ఎమ్మిగనూరు,శివసూర్య, సెప్టెంబర్ 28:ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం (పిఆర్ఎస్ వైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి గా సావాది రఘునాథ్ ఏకగ్రీవం గా ఎన్నికైయ్యారు.కడప నగరంలో రెండు రోజులు పాటూ జరిగిన పిఆర్ఎస్ వైఎఫ్ ప్రథమ రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర కార్యదర్శి గా ఆయనను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....విద్యార్థి, యువజన హక్కులపై ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలిఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు అనేక హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ,ఎన్నికల సమయంలో యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగం లభించే వరకు నెలకు ?3,000 నిరుద్యోగ భృతి, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్, మెగా ఢూజ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు వంటి హామీలను కూటమి ప్రకటించిందని వీటన్నిటిని అమలుకోసం పోరాటం కొనసాగిస్తామన్నారు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ వసతులు, ఫీజుల సమస్యలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు వంటి అంశాలపైన ప్రభుత్వం పైన ఉద్యమం కొనసాగిస్తామని వారు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి గా ఎన్నిక కావటం పట్ల రాష్ట్ర కమిటీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు...

## ప్రజలకు చేరువగా సర్కిల్ ఇన్స్పెక్టర్ పల్లెనిద్ర




మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 28: మెళియాపుట్టి మండలం కోసమాల గ్రామంలో ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ కే వెంకట్రావు గ్రామంలో పల్లె నిద్ర చేసి గ్రామస్తులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని, రాబోవు ఎన్నికలను అందరూ సమిష్టిగా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఫేక్ కాల్స్, ఓటిపి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. గ్రామంలోకి అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అవసరమైన మేరకు పోలీసుల సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 1న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

# జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం,శివసూర్య, సెప్టెంబర్ 28:బ్యాంకు ఉద్యోగుల సమ్మె విరమించిన నేపథ్యంలో అక్టోబర్ 1వ తేదీన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ఉదయం నుంచి యథావిధిగా పంపిణీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు, బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.తూర్పుగోదావరి జిల్లాలో అక్టోబర్ 1వ తేదీన మొత్తం 2,65,945 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.117,21,02,000 పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయనున్నారు. పింఛన్ల నగదు ఉపసంహరణను సెప్టెంబర్ 30వ తేదీన పూర్తి చేయాలని, అక్టోబర్ 1వ తేదీన ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని అధికారులు చర్యలు చేపట్టారు.పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదు అందుబాటులో ఉండేలా సెప్టెంబర్ 30వ తేదీన అన్ని సంబంధిత బ్యాంకు శాఖల్లో తగినంత నగదు నిల్వలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి ఎస్ఈఆర్‌పీ అధికారులు సూచనలు జారీ చేశారు. జిల్లాలోని సంబంధిత అధికారులు స్థానిక బ్యాంకు కంట్రోలర్లు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు, బ్యాంకు శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని 100 శాతం నగదు ఉపసంహరణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.అలాగే, సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయాల సంక్షేమ సహాయకులు తమ పరిధిలోని బ్యాంకు శాఖలకు అవసరమైన నగదు వివరాలను ముందుగానే తెలియజేయాలని సూచించారు. నగదు అవసరాలపై ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా పింఛన్ల పంపిణీ సమయంలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా లబ్ధిదారులు -- పింఛన్ మొత్తం అనపర్తిలో 9,825 మంది లబ్ధిదారులకు రూ.4.28 కోట్లు, బిక్కవోలులో 10,143 మందికి రూ.4.36 కోట్లు, చాగల్లులో 8,948 మందికి రూ.3.92 కోట్లు, దేవరపల్లిలో 10,563 మందికి రూ.4.61 కోట్లు, గోకవరంలో 10,060 మందికి రూ.4.47 కోట్లు, గోపాలపురంలో 8,729 మందికి రూ.3.80 కోట్లు, కడియంలో 11,399 మందికి రూ.5.04 కోట్లు, కపిలేశ్వరపురంలో 9,617 మందికి రూ.4.21 కోట్లు, కోరుకొండలో 11,798 మందికి రూ.5.38 కోట్లు పంపిణీ చేయనున్నారు.కొవ్వూరులో 9,697 మందికి రూ.4.24 కోట్లు, కొవ్వూరు పట్టణంలో 3,802 మందికి రూ.1.71 కోట్లు, మండపేటలో 11,370 మందికి రూ.5.07 కోట్లు, మండపేట పట్టణంలో 6,541 మందికి రూ.2.90 కోట్లు, నల్లజర్లలో 11,090 మందికి రూ.4.86 కోట్లు, నిడదవోలులో 9,967 మందికి రూ.4.41 కోట్లు, నిడదవోలు పట్టణంలో 4,061 మందికి రూ.1.83 కోట్లు, పెరవలిలో 9,890 మందికి రూ.4.31 కోట్లు అందించనున్నారు.రాజమహేంద్రవరం పట్టణంలో అత్యధికంగా 27,153 మంది లబ్ధిదారులకు రూ.11.99 కోట్లు, రాజమహేంద్రవరం గ్రామీణ పరిధిలో 19,511 మందికి రూ.8.70 కోట్లు, రాజానగరంలో 15,088 మందికి రూ.6.70 కోట్లు, రంగంపేటలో 8,576 మందికి రూ.3.75 కోట్లు, రాయవరంలో 9,704 మందికి రూ.4.20 కోట్లు, సీతానగరంలో 11,022 మందికి రూ.4.79 కోట్లు, తాళ్లపూడిలో 7,401 మందికి రూ.3.23 కోట్లు, ఉండ్రాజవరంలో 9,990 మందికి రూ.4.43 కోట్లు పింఛన్లుగా పంపిణీ చేయనున్నారు.పంపిణీలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు అక్టోబర్ 1వ తేదీన ఉదయం 6.30 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బ్యాంకుల నుంచి నగదు ఉపసంహరణ, నగదు భద్రత, క్షేత్రస్థాయికి నగదు తరలింపు, లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ వంటి అంశాల్లో సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పింఛన్ లబ్ధిదారులకు నిర్ణీత సమయంలో పింఛన్లు అందేలా ప్రతి స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, ఎక్కడైనా సాంకేతిక లేదా ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.



## 84 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ





అశ్వారావుపేట ఆర్సి / సెప్టెంబర్ 28( దమ్మపేట మండలంలో గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలో సోమవారం విస్తృతంగాపర్యటించారు. సుమారు రూ.84 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.మొండివర్రె గ్రామంలో నిర్వహించిన 'హలోశుభోదయం'కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.అనంతరం జగ్గారంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి, రూ.10 లక్షలతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. కొడిశెలగూడెంలో రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని, నాయుడుపేట పంచాయతీ పరిధిలోని తాటిసుబ్బన్నగూడెంలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. పట్వారిగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు.అనంతరం మందలపల్లి టిజిఎస్టి డబ్ల్యూఆర్‌ఎస్ లో నిర్వహించిన అశ్వారావుపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగంలో నిర్లక్ష్యం వద్దు భద్రతా ప్రమాణాలు పాటించాలి.. కేవైసీ తప్పనిసరి



అశ్వరావుపేట ఆర్సి/ సెప్టెంబర్ 27( వంటగ్యాస్ వినియోగించే సమయంలో ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని భారత్ గ్యాస్ సిబ్బంది సూచించారు. దమ్మపేట మండల పరిధిలోని పార్కలగండి గ్రామంలో సోమవారం భారత్ గ్యాస్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మహిళలు, గ్యాస్ వినియోగదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్లను సురక్షితంగా వినియోగించే విధానం, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షేత్రస్థాయిలో వివరించారు. ఐఎస్‌ఐ మార్క్ ఉన్న గ్యాస్ పైపులను మాత్రమే వినియోగించాలని, వాటిని రెండేళ్లకోసారి మార్చుకోవాలని సూచించారు. గ్యాస్ లీకేజీ వాసన వస్తే వెంటనే తలుపులు, కిటికీలు తెరిచి, ఎలాంటి విద్యుత్ స్విచ్‌లను ఆన్ చేయకూడదని తెలిపారు. రాత్రి నిద్రించే ముందు, అలాగే ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో రెగ్యులేటర్ నాబ్‌ను తప్పనిసరిగా ఆఫ్ చేయాలని సూచించారు.

### కేవైసీ తప్పనిసరి...

ప్రధానమంత్రి ఉజ్వల యోజన కస్టమర్లు ప్రతి సంవత్సరం కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు కేవైసీ చేయించుకోని సాధారణ వినియోగదారులు కూడా ఆధార్ వివరాలతో వెంటనే కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులో కేవైసీ పూర్తి చేయకపోతే గ్యాస్ కనెక్షన్ రద్దయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వ సబ్సిడీ నిలిచిపోవడంతో పాటు సిలిండర్ల సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు.గ్యాస్ ప్రమాదం సంభవించినప్పుడు ఆందోళన చెందకుండా వెంటనే గ్యాస్ ఏజెన్సీ అత్యవసర నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బందితో పాటు పార్కలగండి గ్రామ మహిళలు, వినియోగదారులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫెడ్ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టొద్దు

ప్రభుత్వం జారీ చేసిన జీవోను పూర్తిగా రద్దు చేయాలి: తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్




అశ్వరావుపేట ఆర్సి / సెప్టెంబర్ 2: ఆయిల్‌ఫెడ్‌కు కేటాయించిన భూములు, ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ఆయిల్‌ఫెడ్ భూములను భూకబ్జాదారులకు అప్పగించరాదని కోరుతూ సోమవారంహైదరాబాద్‌లోని బస్‌భవన్ ఎదుట ఉన్న తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్యాలయం వద్దఅఖిలపక్షరైతుసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.అనంతరం ఆయిల్‌ఫెడ్‌కు చెందిన అన్యాక్రాంతమైన భూములను ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్, మాజీ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, తీగల సాగర్, మహేశ్వర్‌రెడ్డి, కె.పుల్లయ్య తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధర్నాలో తీగల సాగర్ మాట్లాడుతూ.. పామ్‌ఆయిల్ రైతులు, ప్రజలు చేస్తున్న పోరాటాల నేపథ్యంలో ప్రైవేటు వ్యక్తులకు భూములు కేటాయిస్తూ జారీ చేసిన జీవోను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు.అయితే ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సుమారు 16 వేల గజాల ఆయిల్‌ఫెడ్ భూములను తిరిగి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆయిల్‌ఫెడ్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు వ్యక్తులకు భూముల కేటాయింపునకు సంబంధించిన జీవోను పూర్తిగా రద్దు చేసి, ఆయా భూములను ఆయిల్‌ఫెడ్‌కే కేటాయించే వరకు పామ్‌ఆయిల్ రైతులు పోరాటం కొనసాగిస్తారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు జంగారెడ్డి, శోభన్, చలికాని సూరిబాబు, కారం శ్రీరాములు, దొడ్డ లక్ష్మీనారాయణ, రాము, మోరంపూడి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధ తాళలేక వివాహిత ఆత్మహత్య...

జగిత్యాల జిల్లా,గొల్లపల్లి, సెప్టెంబర్ 28,్యాన్సర్ వ్యాధి బాధ తాళలేక, జీవితంపై విరక్తి చెంది ఒక వివాహిత బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గొల్లపల్లి మండలంలో చోటుచేసుకుంది.ఎస్.ఐ. ఎం. కృష్ణ సాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గొల్లపల్లి మండలం శంకర్రావుపేట గ్రామానికి చెందిన గాజుల లత (48) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆమె క్యాన్సర్ గడ్డల సమస్యతో తీవ్ర అనారోగ్యానికి గురై బాధపడుతోంది.ఈ క్రమంలో వ్యాధి బాధ తట్టుకోలేక, జీవితంపై విరక్తి చెందిన లత సోమవారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.మృతురాలి తమ్ముడు గోలి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్.ఐ. కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు."

## మానకొండూర్ లో భారత ప్రధాని నరేంద్ర మోడీ సేవ సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఘనంగా రక్తదాన శిబిరం





మానకొండూరు సెప్టెంబర్ 28 :భారత ప్రధాని నరేంద్ర మోదీ గారి 25 సంవత్సరాల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మానకొండూర్ నియోజకవర్గంలోని మానకొండూర్ తిమ్మాపూర్ శంకరపట్నం మండలాల బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు.ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం హాజరై రక్తదాతలనుఅభినందించారుఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారుసమాజ సేవలో యువత ముందుండాలని, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని బీజేపీ కార్యకర్తలు ప్రజా సేవా కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటున్నారని తెలిపారురక్తదానం చేసిన ప్రతిఒక్కరినీ ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ, "రక్తదానం -- ప్రాణదానం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డిజిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంగ నరేష్ రక్తదాన శిబిరం ప్రోగ్రాం కన్వీనర్ లు గడ్డం అరుణ్ చుక్కల శ్రీకాంత్, కొండ్ర వరప్రసాద్,మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, చింతం శ్రీనివాస్‌ఏనుగుల అనిల్ జిల్లా నాయకులు గాజుల స్వప్న అలివేలు సమ్మిరెడ్డి, అప్పని తిరుపతి, దూలం కిరణ్ గౌడ్, మియాపురం లక్ష్మణచారిశంకరాచారి రావుల, అంబటి తిరుపతి రాజుమండల ప్రధాన కార్యదర్శులు బాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం కుమార్ గొట్టిముక్కుల తిరుపతిరెడ్డినాయకులు సోన్నాకుల శ్రీనివాస్, కత్తి ప్రభాకర్ గౌడ్ఉషకోయిల రమేష్ఎద్దులాపురం అశ్విన్ తేజ అడప రవిగాడిచర్ల భూమయ్య, సాయ వేణి సంపత్ మార్క సుమతి మర్రి ఆంజనేయులు, దాడి ప్రవీణ్, ఉప్పు నితీష్ అజయ్ రాజేందర్ద్వైద వైదిక్ రాకేష్ బీజేవైఎం నాయకులుమండల నాయకులుకార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను రక్తదాతలను నాయకులు అభినందించారు.

## గ్రామ సంఘటితంగా జై భగవాన్ బలరాం జయంతి ఉత్సవం.





నారాయణపేట జిల్లా ప్రతినిధి 2 8 నారాయణపేట జిల్లా, ఉట్కూరు మండలం,పగిడిమారి గ్రామంనం దు భారతీయకిసాన్ సంఘంమా జీ అధ్యక్షుడు జేగ్రామ్ నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ భగవాన్, బ లరాం జయంతి ఉత్సవం సంద ర్భంగా ముఖ్య అతిథిగా జిల్లా స హకార దర్శి ఓబులాపురం మైపా ల్ రెడ్డి శ్రీ భగవాన్ బల రాముని పూజా పునస్కారాలు నిర్వహిం చి, కిసాన్ సంగ్ జెండా ఎగరవేసి కిసాన్ సంఘము నినాదాలు రా జకీయానికి అతీతంగా రైతు సం ఘం పార్టీలు వేరైనా రైతులంతా ఒకటే నినాదంతో గ్రామం లోని పెద్దల సమక్షం లో హనుమాన్ మందిరం ముందు గ్రామ రైతు పెద్దల సమక్షంలో జరుపు కోవ డం జరిగినది, మైపాల్ రెడ్డి మా ట్లాడుతూ.... రైతులందరూ సం ఘటితంగా సమైక్యమై మన స మస్యల మనమే పరిష్కరించు కుందాం, గ్రామంలోని వివిధ స మస్యలు ఎప్పటికప్పుడు ప్రతి నెలా సమావేశమై తెలుసుకొని పరిష్కార మార్గాని కి ప్రభుత్వ అధికారులతో గానీ,మనమే కానీ, పరిష్కార మార్గం ద్వారా స మస్యని అందరి మనసుతో పరి ష్కరించాలి,గ్రామంలో సేంద్రియ వ్యవసాయం ద్వారా భూ సారా న్ని పెంచి అధిక దిగుబడులకు ప్ర యత్నం చేయాలి విద్యుత్ సమ స్యలే గాని రెవెన్యూ సమస్యలే గాని పంటలు పండిన తర్వాత గి ట్టుబాటు ధరకు పంటలు అమ్ము కోవాలి,పాడి ప్రదర్శనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి,ఈ సంవత్స రం కరువు వర్షాలు తక్కువ ఉ న్నందున తగిన విధం గా పంట సాగు చేసుకోవాలి వీలైన మట్టు కు కూరగాయలకు ఎక్కువ ప్రా ధాన్యత ఇవ్వాలి, ప్రతిరోజు కు టుంబానికి1000 నుండి 2000 రూపాయలు ఆర్థికంగా సంపా దించే మార్గం ఎన్నుకోవాలి ప్రతి నెల మొదటి వారంలో సమావే శమై రైతులతో పాలుపంచు కో వాలని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మరాటి బాబు, పద్మా రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, బోడ అశోక్,అయ్యప్ప,నరసప్ప, మోహన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కు రువ చిన్నతిమ్మన్న, శరణప్ప,మ మ్మద్ అనీఫ్, మన్నె వెంకన్న, వ ల్లంపల్లి సిద్ధప్ప, తదితరులు పా ల్గొనడం జరిగింది.

## ఉత్సవాలు ప్రశాంతంగానిర్వహిం చడంలో సహకరించిన ప్రతి ఒక్క రికీ ప్రత్యేక ధన్యవాదాలు.

---జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.....



నారాయణపేట జిల్లా ప్రతినిధి,2 8 ( పజల సహకారం.. పోలీసుల స మన్వయంతో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలకుతావులేకుం డా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, తాఖీ బాబా దర్గా ఉర్సు ఉత్సవా లు ప్రశాంతంగా ముగిసినందున జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా ప్ర జలకు ఉత్సవ కమిటీనిర్వాహకు లకు పీస్ కమిటీ మత పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకట నలో మాట్లాడుతూ.... నారాయ ణ పేట జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు,శోభాయాత్రలు,నిమ జ్జన కార్యక్రమాలతో పాటు తాఖీ బాబా దర్గా ఉర్సు వేడుకలు ఎ లాంటి అవాంఛనీయ సంఘటన లు చోటుచేసుకోకుండాప్రశాంతం గా ముగియడం పట్ల జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హర్షం వ్యక్తం చేశా రు. ప్రజల సహకారం, ఉత్సవ క మిటీల బాధ్యతాయుత వ్యవహా రం, మత పెద్దలు, హిందూ-- ము స్లిం పీస్ కమిటీల సమన్వయం, పోలీస్ శాఖ పటిష్టమైన బందోబ స్తు చర్యలతో, అన్ని శాఖల సమ న్వయం తో ఉత్సవాలు విజయ వంతంగా నిర్వహించామని ఎస్పీ తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహ కులు, ప్రజాప్రతినిధులు, మత పె ద్దలు, పీస్ కమిటీ సభ్యులు,యు వత, జిల్లా ప్రజలకు ప్రత్యేకధన్య వాదాలు తెలిపారు. గణేష్ శోభా యాత్ర నిమజ్జనం,తాఖీ బాబా ద ర్గా ఉర్సు నిర్వాహకులు, భక్తులు పోలీస్ శాఖతో సమన్వయం చే సుకొని కార్యక్రమాలను ప్రశాం తంగా నిర్వహించడంలో సహక రించడం అభినందనీయమన్నా రు.జిల్లావ్యాప్తంగా పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేసి, నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వర్తిం చిన పోలీసు అధికారులు,సిబ్బం దిని ఎస్పీ అభినందించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, వీడి యో రికార్డింగ్, ట్రాఫిక్ నియంత్ర ణ, రూట్ భద్రత వంటిచర్యలతో ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా సమర్థవంతంగ విధులునిర్వహిం చారని తెలిపారు. ప్రజల ఐక్యత, పరస్పర గౌరవం,సోదరభావంనా రాయణపేట జిల్లా శాంతిసామర స్యాలకు ప్రతీక గా నిలిచాయని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూ ర్తిని కొనసాగించాలని ఎస్పీ ఆ కాంక్షించారు.ఈ సందర్భంగా ఉ త్సవ కమిటీ సభ్యులు, నిర్వాహ కులు, ప్రజాప్రతినిధులు,మత పె ద్దలు, పీస్ కమిటీ సభ్యులు, పో లీసు అధికారులు, సిబ్బంది, మీ డియా ప్రతినిధులు,జిల్లా ప్రజలం దరికీ ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా జరుపుకున్న బలరామ జయంతి ఉత్సవాలు.



నారాయణపేట జిల్లా ప్రతినిధి 2 8 నారాయణపేట జిల్లా,దామరగిద్ద మండలం,లింగారెడ్డి పల్లిలో బల రామ జయంతి కార్యక్రమంచేయ డం జరిగింది,జిల్లా సహకారదర్శి మల్లికార్జున్ విద్యుత్ ప్రముఖ మహిపాల్ జిల్లా మాజీ ఉపాధ్య క్షుడు లింగారెడ్డి పల్లి సర్పంచ్ ముగులప్ప, మహిళలు గ్రామ పె ద్దలు పాల్గొనడం జరిగింది,సర్పం చ్ మాట్లాడుతూ.... బలరామ జ యంతి సందర్భంగరైతులందరూ సంఘటితంగా గ్రామాభివృద్ధి కి తోడ్పాటై ఆర్థికంగా పంటలు సా గు చేసి లాభదాలని తెలపడం జ రిగింది,ఈ సంవత్సరం వెళ్లిన సం దర్భంగా వాతావరణం సరిగ్గా లే క వర్షాలు కురువక పంటల దిగు బడి తప్పు ఉంటుంది కాబట్టి లా భసాటి పంటలను పండించి కూ రగాయలకు ప్రాధాన్యత ఇచ్చి న ష్టపోకుండా సాగు చేయాలని కో రడం జరిగింది, గ్రామంలో సేంద్రీ య ద్వారా పంటలు పండించి భూసారని పెంచి అధికదిగుబడు లు సాధించి పంటలకు ఆర్థికంగా లాభం చేకూర్చాలి అదే విధంగా పాడి పరిశ్రమకు ప్రాధాన్యత ఇ చ్చి పాల ద్వారా కుటుంబాన్ని ఆ ర్థికంగా విజయం సాధించొచ్చు అదేవిధంగా మేకల ద్వారా ప్రతి రోజు కులాలకు పశుగ్రాసాలు మే పులకు పోయి పూర్తిగంగ తయా రుచేసి జీవాలను అభివృద్ధి చే యాలి మన కుటుంబానికి ఆర్థి కంగా ఎంతో చేదోడువాదోడుగా ఉంటాయి అదేవిధంగా భారతీ య కిసాన్ సంఘ ఆధ్వర్యంలో మన యొక్క సమస్యలను ఎ ప్పటికప్పుడు పరిష్కరించడానికి మీ రైతాంగల్ సేవ చేయడానికి నేను ఎల్లప్పుడూ మీకు ముందు ఉంటాను రెవెన్యూ సమస్య వి ద్యుత్ సమస్య విత్తనాల సమీక్ష పండిన పంటలు అమ్ముకోవడాని కి మార్కెటింగ్ సమస్య తన దృ ష్టికి ఎప్పుడు వచ్చినా నేను సమ స్య పరిష్కరించడానికి మీ ముం దుంటాను లింగారెడ్డి పల్లె గ్రామం నందు అందరికీ ఆదర్శంగా నిలు ద్దాం రైతాంగాన్ని సంఘటితం చే ద్దాం రైతు సమస్యలను పరిష్క రించిన మనమంతా ఒకటే అని నిరూపించే ఆదర్శంగా నిలుద్దాం, తన హాయంలో సంఘం చేసిన గొప్ప కార్యక్రమాలని అన్నిగ్రామా లను పర్యటించి రైతాంగాని సం ఘటితం చేసి చైతన్యం చేయిం చడం జరిగినది నారాయణపేట జిల్లాలోని నా హాయంలోనే అ న్ని గ్రామాలకు దామరగిద్ద మం డలంలో ఎక్కువ గ్రామ కమిటీ లు వేసి బలోపేతం చేయడం జ రిగినది మళ్లీ ఆ వైభవం తీసుకు ని వచ్చి రైతాంగానికి సేవ చేద్దాం రైతు సమస్యలను తీరుద్దాం మా ట్లాడడం జరిగింది, భగవాన్ బల రాం కు జై నినాదాలతో భారతీ య కిసాన్ సాంగ్ వర్ధిల్లాలి, సం ఘటితంగా ఉందాం సమస్యని పరిష్కరిద్దామని నినాదం చేయ డం జరిగింది.

## విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చొప్పదండి మండలం, సెప్టెంబర్ 2:భారతీయ జనతా పార్టీ చొప్పదండి పట్టణ అధ్యక్షుడు చిల్ల శ్రవణ్




కుమార్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ మాట్లాడుతూ, సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్ పేరుతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సమాజం పట్ల సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.నరేంద్ర మోదీ 25 సంవత్సరాలుగా ప్రజా జీవితంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ, గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జిట్ట కుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండేటి శివశంకర్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మంచికట్ల మల్లేశ్, గుర్రం సమర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు గంగు సంపత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పెంచికల రమాదేవి, అర్దవెల్లి శ్రీనివాస్, గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, అమరగొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గోనుపాడులో కొత్త అభివృద్ధి పనుల గుర్తింపు

సోషల్, రిసోర్స్ మ్యాప్‌లతో గ్రామ అవసరాలపై ప్రణాళిక



గోనుపాడు గోనుపాడు గ్రామంలో సర్పంచ్ జి. రాములమ్మ అధ్యక్షతన సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్‌ల ద్వారా గ్రామంలో చేపట్టాల్సిన కొత్త అభివృద్ధి పనులను గుర్తించారు. గ్రామంలోని ఇళ్లు, కుటుంబాలు, వివిధ వర్గాల ప్రజల వివరాలతో పాటు రహదారులు, కాలువలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర వనరులను మ్యాప్‌ల ద్వారా గుర్తించి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికలో చేర్చనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ రాములమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యమ్మ రాముడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, సాంకేతిక సహాయకుడు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల జిల్లా, సెప్టెంబర్ 28, :ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 62 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై ప్రసాద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## 8వ వార్డులో మురుగు సమస్యకు చర్యలు

మ్యాన్‌హోల్స్ పూడికతీతతో మురుగునీటి సమస్యకు పరిష్కారం..

కౌన్సిలర్ పద్మావతి సుందర్ రాజు చొరవ



అలంపూర్ అలంపూర్ పట్టణంలోని 8వ వార్డులో మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు కౌన్సిలర్ పద్మావతి సుందర్ రాజు చొరవ తీసుకున్నారు. వార్డు పరిధిలోని భూగర్భ మురుగు కాలువల మ్యాన్‌హోల్స్ పూడుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించి సోమవారం పూడికతీత పనులను చేపట్టారు. మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు, పూడికను తొలగిస్తూ మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య సమస్యలపై నిరంతరం దృష్టి సారిస్తున్నామని కౌన్సిలర్ తెలిపారు. చేపట్టిన పూడికతీత పనులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుందర్ రాజు, పారిశుద్ధ్య తనిఖీ అధికారి సామెల్ పరిశీలించారు. వార్డులో మురుగు కాలువలు, మ్యాన్‌హోల్స్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం సరికాదు

ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ విమర్శలను ఖండించిన

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు



గద్వాల ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఖండించారు. సోమవారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు రాజకీయ విమర్శల్లో భాగమని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టే ఓటర్ల జాబితా సవరణకు చట్టపరమైన ఆధారం ఉందని, 2026 మే 27న సుప్రీంకోర్టు బిహార్‌లో నిర్వహించిన ప్రత్యేక సవరణ ప్రక్రియను చట్టబద్ధమైనదిగా సమర్థించిందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించే విధానం ద్వారా అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు చేపట్టే సవరణ ప్రక్రియకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలోనూ ఈ ప్రక్రియకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘంపై చేస్తున్న విమర్శలను ఉపసంహరించుకోవాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, శ్యామ్ రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, బీజేపీ నాయకులు మీర్జాపురం వెంకటేశ్వర్ రెడ్డి, సద్దల కృష్ణ, నరసింహ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## సెక్షన్ 4(1)(బి) సమాచారం ప్రజల ముందుంచాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో 17 అంశాల వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలి




జుక్కల్, సెప్టెంబర్ 28 : సమాచార హక్కు చట్టం--2005లోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రజా ప్రాధికార సంస్థలు వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సీసీఆర్) కామారెడ్డి జిల్లా ప్రతినిధి సభ్యుడు వి. సుశీల్ కుమార్ కోరారు.గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కార్యాలయాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ప్రజా ప్రాధికార సంస్థలు కూడా సెక్షన్ 4(1)(బి) కింద సమాచారాన్ని ప్రజలకు స్పష్టంగా అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఈ నిబంధనలో సంస్థ విధులు, అధికారులు--ఉద్యోగుల అధికారాలు, నిర్ణయ ప్రక్రియ, నియమాలు--నిబంధనలు, రికార్డులు, కమిటీలు, ఉద్యోగుల వివరాలు, వేతనాలు, బడ్జెట్--వ్యయాలు, సబ్సిడీలు--లబ్ధిదారులు, రాయితీలు--అనుమతులు, ఎలక్ట్రానిక్ సమాచారంతో పాటు ప్రజలకు సమాచారాన్ని పొందే సౌకర్యాలు తదితర 17 అంశాల వివరాలను వెల్లడించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.అదేవిధంగా పీఐఓ, ఏపీఐఓ, ఎఫ్ఏఏ పేర్లు, హోదాలు, సంప్రదింపు వివరాలను కార్యాలయ నోటీసు బోర్డులు, అధికారిక వెబ్‌సైట్లు లేదా ఇతర అధికారిక మాధ్యమాల్లో స్పష్టంగా ప్రదర్శించాలని కోరారు. అధికారులు, ఉద్యోగుల బదిలీలు లేదా ఇతర మార్పులు జరిగినప్పుడు సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.సెక్షన్ 4(1)(బి) అమలుతో ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలోపేతం అవుతాయని సుశీల్ కుమార్ పేర్కొన్నారు.

## శాస్త్ర సాంప్రదాయాల ప్రకారం మార్పులు ఉన్నాయి....

ధర్మపురి శ్రీ ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణం,

జీర్ణోదరణకు శృంగేరి పీఠాధిపతుల అనుమతి....

ఆలయం ప్రారంభోత్సవానికి రావాలని జగద్గురులను ఆహ్వానించిన మంత్రి....

పుష్కరాల అనంతరం యోగా నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ చేయాలని నిర్ణయం..



జగిత్యాల జిల్లా,ధర్మపురి: సెప్టెంబర్ 28, న్యూస్:జగిత్యాల



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురిలోని శ్రీ ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ, జీర్ణోదరణ శాస్త్ర సాంప్రదాయాల ప్రకారం మార్పులు ఉన్నాయని శృంగేరి పీఠాధిపతి జగద్గురులు అన్నారు. ధర్మపురి శ్రీ ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ పనుల అనుమతి కొరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో శ్రీనివాస్ తో ధర్మపురి అగ్రహారం పెద్దలు సోమవారం శృంగేరి పీఠాధిపతి జగద్గురు స్వాముల వారిని సోమవారం దర్శించుకొని ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి పునరుద్ధరణ కోసం చేపడుతున్న పనులను వివరించారు.ఈసందర్భంగా ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ జీర్ణోదరణ కు సంబంధించిన పత్రాలను జగద్గురులకు అందజేశారు. ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ శాస్త్ర, సాంప్రదాయాల ప్రకారం ఉందని నిర్మాణ పనులు ప్రారంభించాలని జగద్గురు స్వాములవారు అనుమతి ఇచ్చినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.ధర్మపురి లోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం ఇటీవల రూ. 10 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఇటీవల భూమి పూజ పనులు నిర్వహించారు. ఆలయ పునరుద్ధరణ పనుల అనుమతి కోసం మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో శృంగేరి చేరుకున్న బృందం సభ్యులు ఆలయ విస్తరణకు శాస్త్ర సాంప్రదాయాల ప్రకారం చేపడుతున్న పనులను జగద్గురువులకు వివరించారు. ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు శాస్త్ర సాంప్రదాయాల ప్రకారం ఉన్నాయని పనులు ప్రారంభించి వచ్చే గోదావరి పుష్కరాల లోపు పూర్తి చేయాలని జగద్గురులు సూచించారు. ధర్మపురి లోని శ్రీ యోగా నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టాలని జగద్గురులు సూచించగా 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాల అనంతరం యోగా నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు చేపడతామని మంత్రి లక్ష్మణ్ కుమార్ జగద్గురువులకు వివరించారు. శ్రీ ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తి అయిన తర్వాత ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని జగద్గురులను మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆహ్వానించారు. మంత్రి ఆహ్వానం మేరకు ఉగ్ర నరసింహ స్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తానని జగద్గురులు మాట ఇచ్చారు. శ్రీ యోగ నరసింహస్వామి ఆలయ పునరుద్ధరణ పనులను గోదావరి పుష్కరాలు ముగిసిన వెంటనే ప్రారంభించాలని ఈ సందర్భంగా జగద్గురులు మంత్రి లక్ష్మణ్ కుమార్ ని ఆదేశించారు. జగద్గురుల ఆదేశాలతో పుష్కరాల అనంతరం నిధులు మంజూరు చేయించి శ్రీ యోగా నరసింహస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు సైతం చేపడతామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కి తీర్థ ప్రసాదాలతో పాటు శేష వస్త్రాలను జగద్గురులు అందజేశారు ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణకు అనుమతి ఇవ్వడంతో పనులు ఉపందుకోనున్నాయి.

## మతోన్మాదం, అసమానతలకు వ్యతిరేకంగా యువత పోరాడాలి



ములుగు సెప్టెంబర్ 28 మతోన్మాదం, కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 119వ జయంతి, జాషువా 131వ జయంతిని పురస్కరించుకుని కేవీపీఎస్ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం ప్రవీణ్ మాట్లాడుతూ భగత్‌సింగ్, జాషువా



ఆశయాలు సమానత్వం, సామాజిక న్యాయం వైపు సమాజాన్ని నడిపించాయని అన్నారు. యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుని విద్య, ఉపాధి, సామాజిక అసమానతలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాలని సూచించారు.యువత మాదకద్రవ్యాలు, గంజాయి, జూదపు పందేలకు దూరంగా ఉండి సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని రత్నం ప్రవీణ్ కోరారు. అత్యవసర సమయంలో రక్తం అవసరమైన వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదానం కులమతాలకు అతీతంగా ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జన్ను దేవేందర్, కేజీకేఎస్ జిల్లా అధ్యక్షులు రవిగౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్.రవి, రాకేష్, చంటి, రమేష్, చంద్రయ్య, నాగరాజు, శివకుమార్, రాజ్‌కుమార్, అరవింద్, అశోక్, నగేష్, అతీష్, దేవరాజ్, శ్రీనివాస్, సురేష్, శ్రీహరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మల్లంపల్లిలో ఎరువుల దుకాణాలపై అధికారుల తనిఖీలు

అనుమతి లేని ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు: ఏఈ శ్రీధర్





మల్లంపల్లి, సెప్టెంబర్ 28 రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడంతో పాటు, ఎరువుల అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు తనిఖీలు చేపట్టారు. మల్లంపల్లి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులు, గోదాంలను ఏవో శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం తనిఖీ చేశారు.తనిఖీల్లో భాగంగా శ్రీ నాగార్జున, సుధ, సృజన, వెంకటేశ్వర, అగ్రోస్ తదితర ఫర్టిలైజర్ షాపులను సందర్శించారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, ఎరువుల విక్రయాల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ.. అనుమతి లేని ఎరువులు, నిబంధనలకు విరుద్ధమైన మిశ్రమాలను రైతులకు విక్రయించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి అనధికారిక ఎరువులు లేదా మిశ్రమాలు విక్రయించినట్లు గుర్తిస్తే ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.రైతులకు ఎరువులు విక్రయించే సమయంలో తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, స్టాక్ వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎరువుల నిల్వలు, నాణ్యత, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నాణ్యమైన ఎరువులు అందేలా వ్యాపారులు నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.

# తప్పుడు సర్వేతో నోటీసులు ఇచ్చారు.. మోకా సర్వే చేయించి న్యాయం చేయాలి




మల్లంపల్లి, సెప్టెంబర్ 28 సెప్టెంబర్ 28: ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపురం శివారు-2లోని సెక్టార్-7లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిర్వహించిన సర్వేలో తమ భూములకు సంబంధించి తప్పుడు వివరాలు నమోదు చేసి, ఇతరులకు నోటీసులు జారీ చేశారని తిప్పని రవీందర్, బొల్లపల్లి కుమారస్వామి ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, తమ వద్ద ఉన్న భూమి పత్రాలను పరిశీలించి మోకా సర్వే నిర్వహించాలని వారు కోరారు.వారు అధికారులకు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. రామచంద్రపురం శివారు-2లో తమ కుమారులైన తిప్పని రవితేజ, గొల్లపల్లి విజయ్‌కుమార్ పేర్లపై మొత్తం 16 ఎకరాల 12 గంటల భూమికి పట్టాలు ఉన్నాయని తెలిపారు. ఈ భూమికి సంబంధించి రైతుబంధు కూడా పొందుతున్నామని పేర్కొన్నారు. తాము కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్కులు, లింక్ డాక్యుమెంట్లు తదితర ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు.అయితే రామచంద్రపురం శివారు-2 సెక్టార్-7లో పనిచేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు రంజిత్, రవితేజ, బాలరాజు నిర్వహించిన సర్వేలో తమ భూమికి సంబంధించిన వివరాలను సక్రమంగా పరిగణనలోకి తీసుకోలేదని వారు ఆరోపించారు. తమ పేర్లను తొలగించి, తప్పుడు సర్వే ఆధారంగా పలువురికి నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు.తమను సంప్రదించకుండా, తమ వద్ద ఉన్న భూమి హక్కు పత్రాలను పరిశీలించకుండా సర్వే నిర్వహించడం వల్ల వివాదం ఏర్పడిందని వారు తెలిపారు. సర్వే సమయంలో భూమిపై వాస్తవ పరిస్థితులను, హద్దులను పరిశీలించి, రెవెన్యూ రికార్డులు, పట్టా పాస్‌బుక్కులు, లింక్ డాక్యుమెంట్లు, ఇతర సంబంధిత పత్రాలను సమగ్రంగా పరిశీలించాలని కోరారు.ఈ క్రమంలో బానోతు రామచంద్ర, గుగులోతు దస్మమ్మ, బదావత్ ఫూల్య, మాలోతు మోతిలాల్, భూక్య అనిత, మాలోతు మోహన్‌లాల్, గుగులోతు చంద్రకళ, బదావత్ కవిత, అంబి సరోజన, నేతవత్ భాస్కర్, హుస్సేన్, పలుకల లోహితారెడ్డిలకు నోటీసులు జారీ చేసినట్లు వారు తెలిపారు. అయితే ఈ నోటీసులు ఏ ఆధారాలపై జారీ చేశారో అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.తమ భూములకు సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నందున వాటిని అధికారుల సమక్షంలో సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో మోకా సర్వే నిర్వహించి, భూమి హద్దులను గుర్తించి, రికార్డులతో సరిపోల్చాలని కోరారు. సర్వేలో వాస్తవాలు వెలుగులోకి వచ్చిన అనంతరం అర్హత మేరకు తమకు పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిర్వహించిన సర్వేపై వచ్చిన ఆరోపణలను కూడా అధికారులు విచారణ చేసి వాస్తవాలను నిర్ధారించాలని వారు కోరారు. తమ భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా, అన్ని పక్షాల వాదనలు, రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, మోకా సర్వే నిర్వహించి భూమి సమస్యను పరిష్కరించాలని తిప్పని రవీందర్, బొల్లపల్లి కుమారస్వామి కోరారు.

# తికమకపెట్టే ప్రశ్నలకు ఏఐ స్కోర్ ఎంతంటే..

## 'హ్యూమనిటీస్ లాస్ట్ ఎగ్జామ్'ను అధిగమించగలదా?




కృత్రిమ మేధ (ఏఐ) అసాధ్యాలను సుసాధ్యం చేస్తోంది. ఒకప్పుడు క్లిష్టంగా భావించిన మ్యాసివ్ మల్టీ టాస్కింగ్ ల్యాంగ్వేజ్ అండర్‌స్టాండింగ్ (ఎంఎంఎల్‌యూ) వంటి పరీక్షల్లో 90 శాతానికి పైగా స్కోరు సాధించి మనుషుల మేధస్సును సవాలు చేస్తోంది. అయితే, ఏఐ సామర్థ్యాన్ని కొలిచే పాత కొలమానాలు సరిపోవని భావించిన శాస్త్రవేత్తలు దానికి అత్యంత కఠినమైన పరీక్షలు సిద్ధం చేశారు. అదే 'హ్యూమనిటీస్ లాస్ట్ ఎగ్జామ్(హెచ్‌ఎల్‌ఈ). ఎంఎంఎల్‌యూ అనేది ఏఐ మోడల్స్ తెలివితేటలను, విజ్ఞానాన్ని, సమస్య పరిష్కార సామర్థ్యాన్ని కొలవడానికి ఉపయోగించే ఒక అత్యంత ప్రజాదరణ పొందిన బెంచ్‌మార్క్ పరీక్ష. ప్రస్తుతం టెక్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారిన హెచ్‌ఎల్‌ఈ పరీక్ష వివరాలు, ఏఐ మోడల్స్ పనితీరుపై కథనం.

### ఏమిటీ హెచ్‌ఎల్‌ఈ?

### ఎందుకంత కఠినం?

ప్రపంచవ్యాప్తంగా 50 దేశాలకు చెందిన 500 సంస్థల నుంచి దాదాపు 1,000 మంది నిపుణులు సిద్ధం చేసిన 2,500 ప్రశ్నల సమాహారమే ఈ హెచ్‌ఎల్‌ఈ. సెంటర్ ఫర్ ఏఐ సేఫ్టీ, స్కేల్ ఏఐ పరిశోధకులు దీన్ని రూపొందించారు. ఏఐ మోడల్స్‌లోని లోపాలను ఎత్తిచూపడం, వాటి అసలు సామర్థ్యాన్ని పరీక్షించడం దీని లక్ష్యం. 100కు పైగా విభాగాల్లోని నిపుణులు పంపిన ప్రతి ప్రశ్న ప్రస్తుత ఏఐ మోడల్స్‌ను ఓడించడమే కాకుండా ఇద్దరు నిపుణుల సమీక్షను దాటాల్సి ఉంటుంది. ఈ ప్రశ్నలు ఎంత కఠినంగా ఉన్నాయంటే ఆయా రంగాల్లోని నిపుణుల మధ్యే 15.4% నుంచి 18% వరకు భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అంటే, ఏ ఒక్క మనిషి కూడా అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడం అసాధ్యం.




### గెలుపు ఎవరిది?

ఈ పరీక్ష ప్రారంభమైనప్పుడు (జనవరిలో 'నేచర్' పత్రికలో ప్రచురితమైన సమయానికి) అత్యుత్తమ ఏఐ మోడల్స్ కూడా 10 శాతం కంటే తక్కువ స్కోరుకే పరిమితమయ్యాయి. కానీ, గత కొద్ది నెలల్లోనే ఈ పరిస్థితి వేగంగా మారుతోంది.

### ఆందోళన కలిగిస్తున్న అంశాలు

ఈ పరీక్షలో బయటపడిన ప్రధాన లోపం 'కాలిబ్రేషన్ ఎర్రర్'. సమాధానం తప్పు అని తెలిసినా ఏఐ మోడల్స్ అది 100% సరైనదని మొండిగా వాదిస్తున్నాయి. ఇది భవిష్యత్తులో వైద్య రంగం లేదా ఆర్థిక రంగంలో ఏఐని వాడేటప్పుడు తీవ్రమైన ప్రమాదాలకు దారితీయవచ్చు. 'ఒక తప్పు సమాధానాన్ని తప్పు అని ఏఐ గుర్తించలేకపోవడం అనేది సాంకేతిక లోపం కాదు, ప్రస్తుత ఏఐ డిజైన్ లోనే ఉన్న ఒక నిర్మాణాత్మక సమస్య' అని నిపుణులు చెబుతున్నారు.

### కొలమానమే కరిగిపోతోందా?

ఏఐ సామర్థ్యం ఎంత వేగంగా పెరుగుతుందంటే దాన్ని కొలిచే 'యార్డ్‌స్టిక్' కూడా సరిపోవడం లేదు. అందుకే పరిశోధకులు 'హెచ్‌ఎల్‌ఈ రోలింగ్' పేరుతో నిరంతరం అప్‌డేట్ అయ్యే డైనమిక్ టెస్టింగ్ విధానాన్ని ప్రకటించారు. ఇందులో అత్యుత్తమ స్కోరు సాధించినంత మాత్రాన దానికి జనరల్ ఇంటెలిజెన్స్ వచ్చినట్లు కాదని, కేవలం అకడమిక్ ప్రశ్నల్లో నిపుణత సాధించినట్లేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా మనిషి సృష్టించిన పరీక్షను మనిషి కంటే వేగంగా ఏఐ ఛేదిస్తుండటం విశేషం.

# హీట్‌కు హాట్ సొల్యూషన్ ఇదిగో కూల్ గ్యాడ్జెట్లు!



వేసవి వచ్చిందంటే బయట అడుగు పెడితే చాలు, సూర్యుడు తన వేడి గాలిని ముఖంపై కొడుతూ 'ఇంట్లోనే ఉండు' అని హెచ్చరిస్తూనే ఉంటాడు. కాని, టెక్నాలజీ తెచ్చిన ఈ చిన్న గ్యాడ్జెట్లు, సూర్యుడు తన వేడి ఎంత పెరిగినా 'ఉఫ్' నుంచి 'ఆహా!'గా మార్చేస్తాయి.

### ఫోనుకి బుజ్జి ఏసీ!

సమ్మర్‌లో గేమ్స్ ఆడుతున్నప్పుడు లేదా వీడియోలు చూస్తున్నప్పుడు మీ ఫోన్ వేడి పెనంలా మారిపోతుందా? అయితే మీ ఫోన్ చల్లబరచడానికి వచ్చేసింది ఈ మొబైల్ కూలింగ్ ప్యాడ్! ఇది మామూలు ఫ్యాన్ కాదు, ఇందులో ఉన్న అడ్వాన్స్డ్ సెమీ కండక్టర్ టెక్నాలజీ మీ ఫోన్ టెంపరేచర్‌ను కేవలం సెకన్లలోనే తగ్గించేస్తుంది. అంటే బయట ఎండలు మండిపోతున్నా, మీ ఫోన్ మాత్రం వింటర్ వాతావరణంలో ఉన్నట్టే చిల్ అవుతుంది! దీనికి ఉన్న ఎల్‌ఈడీ డిస్‌ప్లే ఫోన్ ఎంత చల్లగా ఉందో ఎప్పటికప్పుడు చూపిస్తుంది. పైగా ఇందులోని మ్యాగ్నెట్ ఫీచర్ వల్ల ఫోన్ వెనుక సులభంగా అతుక్కుపోతుంది, మీరు గంటల తరబడి గేమింగ్ చేసినా లేదా లైవ్ స్ట్రీమింగ్ చేసినా ఫోన్ హ్యాంగ్ అవ్వదు, బ్యాటరీ కూడా వేడెక్కదు. ఆండ్రాయిడ్ లేదా ఐఫోన్.. ఏదైనా సరే, సెట్ అయిపోతుంది. ధర రూ. 700 మాత్రమే!

### మ్యాజిక్ గ్లాసెస్!

ఫోన్ చూసి చూసి మీ కళ్లు 'ఫ్రై' అయిపోతున్నాయా? బయటకి వెళ్దామంటే సూర్యుడు సెగలతో సినిమా చూపిస్తున్నాడా? ఇలా ఒకేసారి కళ్లకు రక్షణ, మైండ్‌కి రిలాక్సేషన్ ఇచ్చేందుకు వచ్చేసింది ఈ స్మార్ట్ బ్లూటూత్ గ్లాసెస్! ఇందులో ఇన్--బిల్ట్ స్పీకర్లు కూడా ఉన్నాయి. అంటే మీరు కళ్లజోడు పెట్టుకుంటే చాలు, పక్కన ఎవరికీ వినిపించకుండా మీ చెవుల్లో మ్యూజిక్ వినిపిస్తుంది. ఫోన్ తీయకుండానే కాల్స్ కూడా మాట్లేడేయొచ్చు. సాంగ్స్ మార్చుకోవచ్చు. ఇక ఇందులో ఉన్న ఫోటోక్రోమిక్ లెన్సులు ఇంట్లో ఉన్నప్పుడు బ్లూ లైట్ నుంచి, అదే అడుగు బయట పెట్టగానే సెకన్లలో కూలింగ్ గ్లాసెస్‌లా మారి కళ్లకు రక్షణ ఇస్తాయి. పైగా వర్షం పడినా, చెమట పట్టినా ఏమీ కాకుండా దీనికి వాటర్ రెసిస్టెన్స్ కూడా ఉంది. ధర రూ. 1,200 మాత్రమే!

### మంచు కురిపించే గొడుగు!

బయట ఎండలు మండిపోతుంటే.. గొడుగు పట్టుకున్నా సెగలు తగులుతూ చిరాగ్గా ఉందా? అయితే మీ పర్సనల్ ఏసీలాంటి ఈ బీఎన్‌ఎఫ్ సన్ అంబ్రెల్లాని చూస్తే మీరు ఫిదా అయిపోతారు! దీని లోపల ఒక బుజ్జి ఫ్యాన్ ఉండటమే కాకుండా, ఇది చల్లని నీటిని మంచులా చల్లుతుంది. అంటే ఎండలో వెళ్తున్నా, మీ గొడుగు కింద ఒక చిన్న మంచువాన కురుస్తుంది. కేవలం నాలుగు ఏఏ బ్యాటరీలు ఉంటే చాలు.. గాలికి తిరగబడని విండ్‌ప్రూఫ్ డిజైన్‌తో, అటు గాలిని.. ఇటు మంచు జల్లులను మీకు అందిస్తుంది. ఫ్రెండ్స్‌కి గిఫ్ట్ ఇవ్వడానికి కూడా ఇది ఒక అదిరిపోయే ఆప్షన్. ధర రూ. 5,900.

# సెమీకాన్ మార్కెట్ 300 బిలియన్ డాలర్లు

## 2035 నాటికి మార్కెట్ అంచనా

## ఏఐ, డేటా సెంటర్స్ వృద్ధి దన్ను

## డెలాయిట్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీ సెమీకండక్టర్ల మార్కెట్ 2030 నాటికి మూడు రెట్లు పెరిగి 120 బిలియన్ డాలర్లకు చేరనుంది. అలాగే 2035 నాటికి 300 బిలియన్ డాలర్ల స్థాయికి వృద్ధి చెందనుంది. కృత్రిమ మేధ వినియోగం పెరుగుతుండటం, ఆటోమోటివ్ పరిశ్రమ వృద్ధి చెందుతుండటం, డేటా సెంటర్లు విస్తరిస్తుండటం తదితర అంశాలు ఇందుకు దన్నుగా నిలవనున్నాయి. టెక్నాలజీ, మీడియా, టెలికమ్యూనికేషన్స్ భవిష్యత్తుపై డెలాయిట్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ప్రస్తుతం 90 శాతం సెమీకండక్టర్లను భారత్ దిగుమతి చేసుకుంటోంది. అయితే, 2035 ఆఖరు నాటికి దేశీ డిమాండ్‌లో 60 శాతం చిప్స్‌ను స్థానికంగానే ఉత్పత్తి చేసుకోనుంది. 'భారత్‌లో సెమీకండక్టర్ మార్కెట్ 2024--25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 45--50 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండగా, గత మూడేళ్లుగా వార్షికంగా 20 శాతం మేర వృద్ధి చెందుతోందని అంచనా. ఈ నేపథ్యంలో ఏఐ, ఆటోమోటివ్స్, డేటా సెంటర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ ఊతంతో 2030 నాటికల్లా 120 బిలియన్ డాలర్లకు, 2035 నాటికి 300 బిలియన్ డాలర్లకు చేరొచ్చు' అని డెలాయిట్ పేర్కొంది. దేశీయంగా సెమీకండక్టర్ల డిమాండ్‌లో మొబైల్ ఫోన్లు, ఆటోమోటివ్, కంప్యూటింగ్, డేటా సెంటర్లలాంటి సెగ్మెంట్ల వాటా 70 శాతం పైగా ఉండనుంది.

### ఐదేళ్లలో 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ..

ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్‌ఎం) కింద ఇప్పటికే 10 ప్రాజెక్టుల్లోకి 19 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. వీటిలో ఎనిమిది ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ ..టెస్ట్ (ఓఎస్‌ఏటీ) ప్లాంట్లు, ఒక సెమీకండక్టర్ ఫ్యాబ్ ఉన్నాయి. సుమారు 20--25 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో మరో 18--20 ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉన్నాయి. 'వచ్చే ఐదేళ్లలో భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమలోకి మరో 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రావొచ్చు. అలాగే 2030--2035 మధ్య ఇంకో 75--80 బిలియన్ డాలర్లు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఈ వ్యవస్థ మరింతగా విస్తరిస్తుంది' అని నివేదిక వివరించింది.

### భారీగా ఉద్యోగాలు..

సెమీకండక్టర్ల వ్యవస్థ విస్తరించడంతో భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పన కూడా జరగనుంది. 2035 నాటికి పరిశ్రమలో సుమారు 20 లక్షల ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది. ఇందులో 30% ఉద్యోగాలు తయారీ కార్యకలాపాల్లో, 30% డిజైన్ సర్వీసుల్లో, మిగతా 40 శాతం ఇతరత్రా విభాగాల్లోనూ ఉంటాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమ ఏటా 4,00,000--5,00,000 మందికి పరిశ్రమ సంబంధిత కోర్సులు, నైపుణ్యాల్లో శిక్షణనివ్వాల్సి ఉంటుందని నివేదిక వివరించింది. అయితే, ఈ సానుకూల పరిణామాలన్నీ కూడా వ్యూహాలను సరిగ్గా అమలు చేయడంపైనే ఆధారపడి ఉంటాయని వివరించింది. స్థలం, యుటిలిటీలు, మౌలిక సదుపాయాలకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేసేందుకు కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే, వార్షికంగా బడ్జెట్లో కేటాయింపులు, నిర్దిష్ట కాలపరిమితితో కూడుకున్న ప్రోత్సాహక స్కీములకే పరిమితం కాకుండా నిధుల లభ్యతపరంగా కచ్చితత్వం ఉండేలా జాతీయ స్థాయి ప్రోగ్రాంను రూపొందించాలని సూచించింది.

# ఇంధన భద్రతకు 'సౌర' భరోసా

ప్రస్తుత అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, గల్ఫ్ రీజియన్‌లో మారుతున్న పరిణామాలు ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ ఎంత సున్నితమైందో మరోసారి గుర్తుచేశాయి. శిలాజ ఇంధనాల దిగుమతులపై భారీగా ఆధారపడే భారతదేశం వంటి దేశానికి ఇంధన భద్రత అనేది కేవలం ఆర్థిక అంశం మాత్రమే కాదు, అది ఒక వ్యూహాత్మక ప్రాధాన్యత. ఈ నేపథ్యంలో సౌరశక్తి వినియోగాన్ని గరిష్ట స్థాయికి చేర్చుకోవడమే మన ముందున్న ఏకైక మార్గం.




### దశాబ్ద కాలంలో ఇలా..

గడిచిన పదేళ్లలో భారత్ సౌరశక్తి రంగంలో అసాధారణ వృద్ధిని సాధించింది. భారీ సోలార్ పార్కులు, రూఫ్-టాప్ ఇన్‌స్టాలేషన్ల ద్వారా దేశీయ సోలార్ పవర్ సామర్థ్యం 130 గిగావాట్లకు చేరుకుంది. అయితే, సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ ఆ విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి.

భారీ ప్రాజెక్టులు.. వికేంద్రీకృత వ్యవస్థ

భారీ సోలార్ ప్లాంట్లు (ఎల్‌ఎస్‌ఎస్) తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ వాటికి ప్రధాన అడ్డంకి ట్రాన్స్‌మిషన్ (సరఫరా) వ్యవస్థ. మారుమూల ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను నగరాలకు చేరవేయడానికి భారీ వ్యయంతో కూడిన కారిడార్లు అవసరం. దీనివల్ల విద్యుత్ నష్టాలు పెరగడం, మౌలిక సదుపాయాల కల్పనలో ఆలస్యం కారణంగా విద్యుత్ తరలింపు నిలిచిపోతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా 'పీఎం సూర్య ఘర్' వంటి పథకాలు గృహ వినియోగదారులను ప్రోత్సహిస్తున్నాయి. ఇందులో భాగంగా విద్యుత్ ఎక్కడైతే ఉత్పత్తి అవుతుందో అక్కడే వినియోగిస్తున్నారు. దీనివల్ల గ్రిడ్‌పై ఒత్తిడి తగ్గుతుంది.

### గ్రిడ్ నిర్వహణలో సాంకేతిక ఇబ్బందులు



సాధారణంగా విద్యుత్ గ్రిడ్లు ఒకే దిశలో (పవర్ ప్లాంట్ నుంచి వినియోగదారుడికి) ప్రవహించేలా రూపొందించబడ్డాయి. కానీ రూఫ్-టాప్ సోలార్ వల్ల విద్యుత్ రెండు వైపులా ప్రవహిస్తుంది. దీనివల్ల గ్రిడ్ అస్థిరతకు దారితీసే ప్రమాదం ఉంది. సంపన్న వినియోగదారులు సోలార్ వైపు మళ్లడంతో డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు నష్టపోతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని రాష్ట్రాలు అదనపు ఛార్జీలు విధిస్తూ సోలార్ వినియోగాన్ని పరోక్షంగా నిరుత్సాహ పరుస్తున్నాయనే వాదనలున్నాయి.

### సవాళ్లు - పరిష్కారాలు

సౌర విద్యుత్ ఉత్పత్తి మధ్యాహ్నం వేళలో గరిష్టంగా ఉంటుంది, కానీ ఆ సమయంలో గృహాల్లో వినియోగం తక్కువగా ఉంటుంది. సాయంత్రం వేళల్లో డిమాండ్ పెరిగినప్పుడు సౌర ఉత్పత్తి ఉండదు. దీనినే అంతర్జాతీయంగా 'డక్ కర్వ్' సమస్య అంటారు. దీనిని అధిగమించడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి. పగటిపూట మిగిలిన విద్యుత్‌ను భద్రపరిచి రాత్రి వేళల్లో వాడుకోవాలి. విద్యుత్ సమృద్ధిగా ఉన్న సమయంలో రేట్లు తగ్గించి వినియోగదారులను ఆ సమయంలోనే ఎక్కువ విద్యుత్ వాడేలా ప్రోత్సహించాలి.

### సరికొత్త వ్యూహం.. సోలార్, ఈవీ అనుసంధానం

ప్రస్తుతం భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కొరత. ప్రభుత్వం పీఎం-డ్రైవ్ పథకం ద్వారా ఛార్జింగ్ స్టేషన్లను విస్తరించాలని చూస్తోంది. సగటున ఒక ఇంటిపై ఉండే 3 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ నుంచి వచ్చే మిగులు విద్యుత్ తక్కువగా ఉండొచ్చు. కానీ ఒక అపార్ట్‌మెంట్ లేదా కాలనీలోని ఇళ్లన్నీ కలిపి ఆ మిగులు విద్యుత్‌ను అక్కడే ఉండే పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ పాయింట్లకు మళ్లించవచ్చు. తూత్తుకుడిలోని వీవోసీ పోర్ట్ ఇప్పటికే ఈ నమూనాను విజయవంతంగా అమలు చేస్తోంది. స్థానిక సౌర విద్యుత్‌ను అక్కడే ఈవీ వినియోగానికి అనుసంధానించడం ద్వారా భారీగా ఖర్చు తగ్గించుకున్నారు. భారతదేశ ఇంధన భవిష్యత్తు సౌరశక్తి, ఎలక్ట్రిక్ వాహనాల అనుసంధానంలోనే ఉంది. డిస్కంలు సోలార్‌ను ఒక ముప్పుగా కాకుండా ఒక అవకాశంగా భావించి స్మార్ట్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి. అప్పుడే నిజమైన ఇంధన స్వయంసమృద్ధిని సాధించగలం.

# 'అసలుకు అచ్చుగుద్దినట్లు చేస్తే ఊరుకోం'

## సీడ్యాన్స్ 2.0ను నిలిపేసిన చైనా

## కాపీరైట్ నిబంధనల ఉల్లంఘనలే కారణం




**ప్రపంచవ్యాప్తంగా టిక్‌టాక్, క్యాప్‌కట్ వంటి యాప్‌లతో సంచలనం సృష్టించిన చైనా కంపెనీ 'బైట్‌డ్యాన్స్'కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తన ప్రతిష్టాత్మకమైన ఏఐ వీడియో జనరేషన్ మోడల్ 'సీడ్యాన్స్ 2.0' గ్లోబల్ లాంచ్‌ను కంపెనీ నిరవధికంగా నిలిపివేసింది. హాలీవుడ్ అగ్రశ్రేణి నిర్మాణ సంస్థల నుంచి కాపీరైట్ ఉల్లంఘన నోటీసులు రావడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది.**

### వివాదానికి కారణం ఇదే..

సీడ్యాన్స్ 2.0 సృష్టించే వీడియోలు అచ్చం హాలీవుడ్ భారీ బడ్జెట్ చిత్రాలను తలపిస్తున్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన కొన్ని క్లిప్స్ చిత్ర పరిశ్రమను విస్మయానికి గురిచేశాయి. అందులో హాలీవుడ్ నటులు బ్రాడ్ పిట్, టామ్ క్రూజ్ మధ్య జరిగిన పోరాట దృశ్యాలు రియలిస్టిక్‌గా ఉన్నాయి. ఐకానిక్ క్యారెక్టర్లుగా పేరున్న స్పైడర్ మ్యాన్, వెనమ్ వంటి సూపర్ హీరోలతో పాటు ప్రముఖ యానిమేషన్ క్లిప్‌లను ఈ ఏఐ మోడల్ అత్యంత నాణ్యతతో సృష్టించింది. దాంతో తమ మేధో సంపత్తిని అనుమతి లేకుండా ఈ మోడల్‌కు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగించారని హాలీవుడ్ స్టూడియోలు మండిపడుతున్నాయి.

### హాలీవుడ్ దిగ్గజాల ధ్వజం

ప్రముఖ నిర్మాణ సంస్థ డిస్నీ గత నెలలోనే బైట్‌డ్యాన్స్‌కు 'సీజ్ అండ్ డెసిస్ట్' (నిలిపివేత) లేఖను పంపింది. తమ కంటెంట్‌ను అనుమతి లేకుండా వాడుకున్నారని డిస్నీ ఆరోపించింది. మరోవైపు, పారామౌంట్ స్కైడాన్స్ సైతం రంగంలోకి దిగింది. 'స్టార్ ట్రెక్, ది గాడ్ ఫాదర్, సౌత్ పార్క్ వంటి మా ఐకానిక్ చిత్రాల హక్కులను బైట్‌డ్యాన్స్ ఉల్లంఘించింది' అని పారామౌంట్ స్పష్టం చేసింది. సీడ్యాన్స్ 2.0 ప్రస్తుతం చైనాలో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రొఫెషనల్ ఫిల్మ్ మేకింగ్, ఇ-కామర్స్, అడ్వర్టైజింగ్ రంగాల్లో విప్లవాత్మక మార్పుల కోసం రూపొందించారు. ఒకవేళ ఇది గ్లోబల్ మార్కెట్లోకి వస్తే హాలీవుడ్ ఉనికికే ప్రమాదమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## “సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు భారతరత్న ఇవ్వాలి”




న్యూఢిల్లీ: దేశంలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు, సీజేపీతో పాటు చాలా మంది పరముఖులు వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటువంటి సమయంలో జ్ఞానేశ్ కుమార్‌కు మద్దతుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో అగర్వాల్, వైశ్య సామాజిక వర్గాలకు చెందిన సంస్థలు భైఠాయించాయి. ఎన్నికల సంఘాన్ని ప్రతిపక్షాలు లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆరోపిస్తూ ఆయా సంఘాల నాయకులు నినాదాలు చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్‌కు వ్యతిరేకంగా కూడా నినాదాలు చేశారు. జ్ఞానేశ్ కుమార్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్నవారు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి తమ మద్దతు ప్రకటించారు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రతిపక్ష నేతలు ఎన్నికల సంఘంపై రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని వారు విమర్శించారు.

### సర్‌కు మద్దతుగా బీజేపీ..

భారతీయ జనతా పార్టీ నేత జై భగవాన్ గోయల్ కూడా జ్ఞానేశ్ కుమార్ పనితీరును ప్రశంసిస్తూ ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ప్రతిపక్షాన్ని ఆయన విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్ చర్యల కారణంగా ఓటరు జాబితా నుంచి బంగ్లాదేశ్, రోహింగ్యా ప్రజల పేర్లను తొలగించారని గోయల్ పేర్కొన్నారు. ఈ చర్య వల్ల పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఎదురైన ఓటమికి ఎన్నికల సంఘం, ముఖ్యంగా జ్ఞానేశ్ కుమార్ కారణమై ఉండవచ్చని ప్రతిపక్షం భావిస్తోందని గోయల్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ఎన్నికల ఫలితాలపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నారని గోయల్ అన్నారు. ప్రతిపక్షానికి ప్రజల మద్దతు లేకపోవడంతోనే ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుంటోందని ఆయన ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతికూల వాతావరణం సృష్టించే ప్రయత్నం జరుగుతోందని గోయల్ పేర్కొన్నారు. ఇతర ఎన్నికల కమిషనర్ల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి జ్ఞానేశ్ కుమార్ పనితీరుపై ఫిర్యాదు పంపినట్లు తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ తన ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఆ ఫిర్యాదులో ఉన్నాయని చెప్పారు. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాల నిరసనలు, ఆయనకు మద్దతుగా జరుగుతున్న కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం వ్యవహారశైలి, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై రాజకీయ చర్చ మరింత కొనసాగనున్నట్లు ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

## అక్టోబర్ 2న ‘జైల్ భరో’కు సీజేపీ నేత అభిజీత్ దీప్కే పిలుపు!



ముంబై: ముంబైలో అక్టోబర్ 2న నిర్వహించాలనుకున్న నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ‘జైల్ భరో ఆందోళన’కు పిలుపునిచ్చారు. శివాజీ పార్క్‌లో నిరసనకు అనుమతి ఇవ్వలేమని ముంబై పోలీసులు స్పష్టం చేసిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో నిరసన చేపట్టాలని సీజేపీ నిర్ణయించింది. అయితే అక్కడ సభ నిర్వహించేందుకు అనుమతి ఇచ్చే అధికారం తమకు లేదని ముంబై పోలీసులు తెలిపారు. బాంబే హైకోర్టు తీర్పు, అనంతరం మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఇందుకు కారణాలుగా పేర్కొన్నారు. శివాజీ పార్క్‌లో భారీగా ప్రజలు గుమిగూడితే శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ రద్దీ, ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. నిరసన కోసం ముంబైలోని మరో ప్రాంతాన్ని ఎంచుకుని అనుమతి కోరాలని నిర్వాహకులకు సూచించారు. అనుమతి నిరాకరణపై దీప్కే స్పందిస్తూ.. పౌరుల గొంతుకను అణచివేసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడటం ఆమోదయోగ్యం కాదని గతంలో పేర్కొన్నారు. తాజాగా అక్టోబర్ 2న ముంబైలో ‘జైల్ భరో ఆందోళన’ నిర్వహిస్తామని ఎక్స్‌లో ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించినదిగా ఆయన అభివర్ణించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. అలాగే ఓటర్ల జాబితాలపై చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)ను నిలిపివేయాలని, ఎన్నికల సంఘానికి సంబంధించిన చట్టపరమైన వ్యవస్థలో మార్పులు చేయాలని కోరుతోంది. ఎన్నికల జాబితాల నిర్ణయాలు, సర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ నిరసనకు పిలుపునిచ్చారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం తన పనితీరులో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. సంస్థలో అభిప్రాయ భేదాలు ఉండటం సాధారణమేనని, కీలక నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని తెలిపింది.

## కేదార్‌నాథ్‌లో చిక్కుకుపోయిన ఏపీ యాత్రికులు



కేదార్‌నాథ్: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ యాత్ర మార్గంలో కొండచరియలు విరిగిపడటంతో చిక్కుకుపోయిన సుమారు 1,500 మంది యాత్రికులను అధికారులు సురక్షితంగా తరలిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో చిర్‌బాసా ప్రాంతంలో యాత్రికులు చిక్కుకుపోయినట్లు సమాచారం అందడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలు సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టాయి. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలానికి చెందిన 45 మంది యాత్రికులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. దర్శనాలు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. తమతో పాటు వేలాది మంది యాత్రికులు ఇక్కడే నిలిచిపోయినట్లు రాయవరం యాత్రికులు చెబుతున్నారు. ఈ వివరాలను ఫోన్ ద్వారా యాత్రికుడు పీవీ కృష్ణారెడ్డి తెలియజేశారు. కాగా ఈ యాత్రికుల క్షేమంపై కుటుంబ సభ్యుల ఆందోళన చెందుతున్నారు. సోన్‌ప్రయాగ్‌కు సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిర్‌బాసా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొండచరియలు విరిగిపడటంతో మార్గంలో భారీగా మట్టి, రాళ్లు పేరుకుపోయాయి. అంతేకాకుండా కొండపై నుంచి రాళ్లు పడుతుండటంతో యాత్రికుల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. సమాచారం అందుకున్న వెంటనే సబ్ ఇన్‌స్పెక్టర్ ఆశిష్ డిమ్రీ నేతృత్వంలోని ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఘటనా స్థలానికి చేరుకుంది. పరిస్థితిని అంచనా వేసిన అనంతరం ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాదకరమైన కొండచరియల ప్రాంతాన్ని యాత్రికులు సురక్షితంగా దాటేలా రెస్క్యూ సిబ్బంది మార్గనిర్దేశం చేశారు. అనంతరం వారిని మరోవైపునకు చేర్చి గౌరీకుండ్‌కు తరలించారు. ఈ ఘటనలో యాత్రికులందరినీ సురక్షితంగా తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో చార్‌ధామ్ యాత్ర వరుసగా రెండో రోజూ నిలిచిపోయింది. వర్షాలు, కొండచరియల కారణంగా యాత్రికుల భద్రత దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

# జెన్‌జీ జేబులో మన్మోహన్.. ఆ అడుగులే ఇప్పుడు!





మన్మోహన్ సింగ్ పేరు వినగానే చాలామందికి గుర్తొచ్చేది.. నిశ్శబ్దంగా మాట్లాడే మాజీ ప్రధాని. కానీ నేటి జెన్‌జీకి ఆయన అంతకంటే ఎక్కువ. చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ నుంచి ఇంటర్నెట్ వరకు.. స్టార్టప్‌ల నుంచి విదేశీ కంపెనీల ఉద్యోగాల వరకు.. భారత ఆర్థిక వ్యవస్థలో మూడు దశాబ్దాలుగా కనిపిస్తున్న ఎన్నో మార్పుల వెనుక ఆయన ఆలోచనల ముద్ర కనిపిస్తుంది. ఒక్కసారి 1991కి వెళ్దాం. అప్పట్లో దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. విదేశీ మారక నిల్వలు పడిపోయాయి. దేశం తన అవసరాలకు కావాల్సిన వస్తువులను కొనుక్కోవడానికే ఇబ్బంది పడే పరిస్థితి. ఆ సమయంలో పీవీ నరసింహారావు ప్రధానిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థలో పెద్ద మార్పులకు శ్రీకారం చుట్టారు. దిగుమతులు, పెట్టుబడులు, పరిశ్రమలు, ప్రైవేట్ రంగంపై ఉన్న అనేక ఆంక్షలను క్రమంగా సడలించారు. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచంతో మరింతగా అనుసంధానం చేసే దిశగా అడుగులు వేశారు. ఆ మార్పులు అంటే అప్పట్లో సామాన్యుడికి వెంటనే అర్థమయ్యే విషయం కాదు. కానీ వాటి ప్రభావం క్రమంగా కనిపించింది. విదేశీ కంపెనీలకు భారత మార్కెట్ తెరుచుకుంది. ప్రైవేట్ రంగానికి అవకాశాలు పెరిగాయి. పోటీ పెరిగింది. కొత్త పరిశ్రమలు, కొత్త సేవలు వచ్చాయి. తర్వాతి సంవత్సరాల్లో ఐటీ రంగం వేగంగా విస్తరించడానికి కూడా ఈ మారిన ఆర్థిక వాతావరణం ఒక నేపథ్యంగా నిలిచింది. ఇప్పుడు 2026. దేశ ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడితే జీడీపీ వృద్ధి బలంగానే కనిపిస్తోంది. ప్రపంచ బ్యాంకు ప్రకారం 2025--26లో భారత ఆర్థిక వృద్ధి 7.6 శాతంగా నమోదైంది. కానీ, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రపంచ పరిస్థితులు, ముఖ్యంగా ఇంధన ధరలు, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో వృద్ధి 6.6 శాతానికి తగ్గొచ్చని అంచనా వేసింది. అయితే జెన్‌జీ ప్రశ్న మాత్రం జీడీపీ దగ్గర ఆగిపోదు.

### మరి నాకు మంచి ఉద్యోగం ఎప్పుడు?

ఇదే అసలు ప్రశ్న. ఇటీవలి ఆర్థిక విశ్లేషణల్లోనూ ఇదే అంశం ప్రధానంగా కనిపిస్తోంది. ఐఎంఎఫ్ తాజా విశ్లేషణ ప్రకారం భారత వృద్ధికి ఉద్యోగాలు, ఉత్పాదకత, నైపుణ్యాల మధ్య ఉన్న అంతరం పెద్ద సవాలుగా మారింది. కోట్లాది మంది యువత ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్న సమయంలో.. జీడీపీ పెరగడం కంటే వారికి స్థిరమైన, మంచి ఆదాయం ఇచ్చే ఉద్యోగాలు ఎంత వస్తున్నాయన్నదే కీలకం.

### ఇక్కడే మన్మోహన్ మళ్లీ జెన్‌జీ జేబులోకి

ఎందుకంటే ఆయన కాలంలో మొదలైన ఆర్థిక మార్పులు “ప్రపంచంతో పోటీ పడే భారత్” అనే దిశను బలపరిచాయి. నేడు ఒక చిన్న పట్టణంలో ఉన్న యువకుడు విదేశీ కంపెనీలో ఉద్యోగానికి దరఖాస్తు చేయగలగడం, ఇంటి నుంచే ఆన్‌లైన్ సేవలు అందించడం, యాప్ ద్వారా వ్యాపారం మొదలుపెట్టడం, ప్రపంచ మార్కెట్ గురించి తెలుసుకోవడం.. ఇవన్నీ ఒక్కరోజులో వచ్చిన మార్పులు కావు. మూడు దశాబ్దాలుగా భారత ఆర్థిక వ్యవస్థలో జరిగిన మార్పుల ఫలితంగా ఏర్పడిన అవకాశాల గొలుసులో ఇవి భాగం. అయితే కథ ఇక్కడితో పూర్తికాదు. అప్పట్లో భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో కలపడం పెద్ద సవాలు అయితే.. ఇప్పుడు ఆ వృద్ధి ఫలాలను ఎక్కువ మందికి చేరేలా చేయడం మరో పెద్ద సవాలు. ముఖ్యంగా యువతకు ఉద్యోగాలు, చిన్న వ్యాపారాలకు అవకాశాలు, మహిళలకు ఉపాధి, నైపుణ్యాలకు తగ్గ పనులు రావాల్సి ఉంది. ఉద్యోగ కల్పన కోసం ప్రైవేట్ రంగ పెట్టుబడులను పెంచే సంస్కరణలపై ప్రపంచ బ్యాంకు కూడా దృష్టి పెట్టింది.

### అప్పట్లో మన్మోహన్ సింగ్ ముందున్న ప్రశ్న.. “భారత ఆర్థిక వ్యవస్థను ఎలా కాపాడాలి?” ఇప్పుడు జెన్‌జీ ముందున్న ప్రశ్న.. “ఈ ఆర్థిక వృద్ధిలో నా భవిష్యత్తు ఎక్కడ?”

మన్మోహన్ సింగ్ జయంతి రోజున ఆయనను గుర్తు చేసుకోవడం అంటే కేవలం ఓ మాజీ ప్రధానికి, గొప్ప ఆర్థికవేత్తగా గుర్తుంచుకుని నివాళి ఇవ్వడం కాదు.. నేటి భారత ఆర్థిక వ్యవస్థ ఎలా ఇక్కడికి వచ్చిందో గుర్తు చేసుకోవడం కూడా.

# సహజీవన రాగం సాధ్యమా?



ఆర్థిక రంగం మొదలు కృత్రిమ మేధ (ఏఐ) వరకూ అన్నిటా పరస్పరం హోరాహోరీ తలపడుతున్న బలమైన ప్రత్యర్థులు అమెరికా, చైనాలు నాలుగు నెలల వ్యవధిలో రెండోసారి కరచాలనం చేసుకున్నాయి. మొన్న మేలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ చైనాలో పర్యటించగా... మూడు రోజుల దౌత్య పర్యటన కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బుధవారం వాషింగ్టన్ వచ్చారు. ఆయనకు రెండురోజులూ ఘనసత్కారాలే దక్కాయి. కెమెరాల ఎదుట అధినేతలిద్దరూ చిరునవ్వులు చిందించటం కూడా చూడముచ్చట గానే ఉంది. కానీ రెండు దేశాల మధ్యా ఉన్న సమస్యలు గానీ,వాటి కారణంగా ఇప్పటికే పేరుకు పోయిన విభేదాలు గానీ చిన్నవేం కాదు. అవి సంక్లిష్టమైనవి, సామరస్య పరిష్కారానికి ఓపట్టాన లొంగనివి. 60వ దశకంలో నాటి రష్యా అధినేత నికితా కృశ్చేవ్ ప్రతిపాదించిన ‘మూడు శాంతుల’ ప్రతిపాదనలో ఒకటైన ‘శాంతియుత సహజీవనం’ సూత్రాన్ని గుర్తుకు తెచ్చేలా సంఘర్షణకన్నా సహకారమే ఇద్దరికీ లాభదాయకమని షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. అప్పట్లో కృశ్చేవ్‌కు రానట్టే జిన్‌పింగ్‌కు కూడా ట్రంప్‌నుంచి అనుకూల స్పందనేమీ రాలేదు. కానీ ఇరుపక్షాలూమరింత సమతూక వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవటానికి కలిసి పనిచేస్తున్నాయని ట్రంప్ అన్నారు. ఎగుమతులు పెంచటానికీ, ఆర్థికాభివృద్ధి సాధించటానికీ చైనా ప్రభుత్వం అక్కడి తయారీ రంగ పరిశ్రమలకు భారీయెత్తున సబ్సిడీలిస్తోంది. దాంతో చవగ్గా కార్లు, సౌరశక్తి ప్యానెళ్లు, ఖనిజాలు, ఉక్కు, ఇతర రకాల సరుకులు పాశ్చాత్య మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. ఈ వ్యూహం అమెరికానూ, పాశ్చాత్య దేశాలనూ తీవ్రంగా దెబ్బ తీస్తోంది. దీన్ని తగ్గించేందుకు తొలి ఏలుబడిలో ట్రంప్ చేసిన ప్రయత్నాలు కొంత వరకూ ఫలితాన్నిచ్చాయి. నిరుడు దీన్ని మరింత నియంత్రించేందుకు 25 శాతం అదనపు సుంకాలు విధించారు. వాటి కారణంగా సరుకుల వరద తగ్గిన మాట వాస్తవమే అయినా, దాదాపు 40 పాశ్చాత్య దేశాల మీదుగా ఆ వస్తువులు వెల్లువెత్తటం ట్రంప్‌కు తలనొప్పిగా మారింది. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగానే చైనా ఇదంతా చేస్తోంది. ఎవరెంతగా మొత్తుకుంటున్నా విదేశాలతో నిరుడు చైనా వాణిజ్య మిగులు లక్ష కోట్ల డాలర్ల పైమాటే. ఈమధ్యే అమెరికా మాజీ ఆర్థికమంత్రి జానెట్ ఎలెన్ అంతంతమాత్రంగా ఉన్న అమెరికా పారిశ్రామిక రంగం ‘చైనా షాక్’తో మరింత కుంగటం ఖాయమని చేసిన హెచ్చరిక వర్తమాన స్థితికి అద్దం పడుతోంది. చైనా సరుకులపై వ్యామోహంతగ్గించుకోమంటూ జనానికి చేసే హితబోధలేమీ పనిచేయటం లేదు. ‘మాగా’ పేరు చెప్పి ఆవేశంతో ఊగిపోయేవారు సైతం ఈ విషయంలో ట్రంప్ మాటల్ని బేఖాతరు చేస్తున్నారు. దాంతో దిక్కుతోచని స్థితిలో చైనాపై గత నెలలో 12.5 శాతం అదనపు సుంకాలు విధించారు. కానీ వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుకోవాలన్న అవగాహన కుదిరాక గత నెలలో కొన్ని వస్తువులకు దీన్నుంచి మినహాయింపునిచ్చారు. నవంబర్‌తో ముగియాల్సిన ఆ వెసులుబాటును తాజాగా వచ్చే జనవరి 10 వరకూ పొడిగించారు. అమెరికాతో సంఘర్షణ ముదిరితే జరిగే పర్యవసానాలేమిటో చైనాకు తెలియంది కాదు. అందుకే అది ద్విముఖ వ్యూహం అనుసరిస్తోంది. సుంకాలవల్ల అమెరికాలో కోల్పోయే నష్టాన్ని యూరోప్ దేశాల్లో భర్తీచేసుకుంటోంది. అలాగే తమవల్ల నష్టపోయే దేశాల్లో పరిశ్రమలు స్థాపిస్తామని, పెట్టుబడులు పెడతామని ప్రతిపాదిస్తోంది. ఆ దేశాల్లో భారీయెత్తున ఉద్యోగావకాశాలొస్తాయని ఊరిస్తోంది. ఈ వంకనే ప్రపంచాన్ని మభ్యపెట్టి నిలువు దోపిడీచేసిన చరిత్రగల అమెరికా, యూరోప్ దేశాలు వీటిని అంత తేలిగ్గాఅంగీకరిస్తాయా? ఈ విషయమై చైనాతో ఈయూ వచ్చేనెలలో చర్చించబోతోంది. కానీ ఫలితం ఉంటుందన్న ఆశ మాత్రం లేదు. అమెరికా-చైనా ఘర్షణలు ముదిరితే బాగుండు నని అవి కోరుకుంటున్నాయి. ఆ మాటెలా వున్నా ట్రంప్, జిన్‌పింగ్‌లిద్దరూ చైనాలోనవంబర్‌లో జరిగే ఆసియా పసిఫిక్ ఎకనామిక్ ఫోరం, డిసెంబర్‌లో అమెరికాలో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సుల సందర్భంగా కలుసుకోబోతున్నారు. అప్పటికల్లా వాణిజ్య సమస్య ఉపశమించాలని రెండు దేశాలకూ కోరికైతే ఉంది. కానీ పరస్పర విరుద్ధ శక్తుల మధ్య అదంత సులభం కాదని చరిత్ర చెబుతోంది.

# కుక్కకాటుకు తగిన చెప్పుదెబ్బ



రేబీస్... నేటికీ నిర్దిష్టమైన చికిత్స విధానం లేని అత్యంత ప్రాణాంతకమైన జూనోటిక్ వ్యాధి. (జంతువుల నుంచి మనుషులకు, అలాగే మనుషుల నుండి జంతువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్స్ అంటారు). లూయిా పాశ్చర్ 1885లో తొలిసారిగా రేబీస్ నిరోధక టీకాను అభివృద్ధి చేశారు. ఆయన అందించిన ఈ ఆవిష్కరణే నేటికీ మానవాళికి రేబీస్ బారినుంచి రక్షణ కల్పించే ఏకైక ఆయుధంగా ఉపయోగపడుతోంది. లూయిా పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28న ‘ప్రపంచ రేబీస్ దినోత్సవం’ నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ‘కలిసికట్టుగా... మరింత బలంగా’ అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా దాదాపు 59 వేల మంది రేబీస్‌తో మరణి స్తున్నారు. ఇందులో 95 శాతానికి పైగా మరణాలు ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోనే సంభవిస్తున్నాయి. భారత దేశంలో ఏటా సుమారు 5,700 మంది మరణిస్తున్నారని జాతీయ అధ్యయ నాలు స్పష్టం చేస్తున్నాయి. బాధితుల్లో ఎక్కువ శాతం 15 ఏళ్లలోపు పిల్లలే ఉండటం విచారకరం. ఈ నేపథ్యంలో 2030 నాటికి కుక్కల కాటు వల్ల సంభ వించే రేబీస్ మరణాలను పూర్తిగా నిర్మూలించాలనేది ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ జంతు ఆరోగ్య సంస్థలు నిర్దేశించుకున్న ‘జీరో బై 30’ ప్రధాన లక్ష్యం.

### ఏడాది తర్వాతా బయటపడొచ్చు!

రేబీస్ అనేది ‘లైసావైరస్’ అనే వైరస్ ద్వారా వ్యాప్తి చెంది కేంద్ర నాడీ వ్యవస్థపై దాడి చేసే తీవ్రమైన వ్యాధి. మానవుల్లో నమోదయ్యే రేబీస్ కేసుల్లో దాదాపు 99 శాతం కుక కాటు ద్వారానే వస్తున్నాయి. వ్యాధిగ్రస్థ కుక్కలతో పాటు పిల్లులు, నక్కలు, తోడేళ్లు, గబ్బిలాలు వంటి జంతువుల లాలాజలం ద్వారా కూడా ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. రేబీస్ సంక్రమించినప్పుడు జంతువు విపరీతమైన కోపంతో కనిపిస్తుంది. కనపడిన ప్రతి వస్తువును చివరికి చెక్కముక్కలు, రాళ్లను కూడా కొరుకుతుంది. నోటి నుంచి విపరీతంగా లాలాజలం (సొల్లు) కారుస్తుంది. మొరిగే స్వరం మారుతుంది. తన యజమానిని కూడా గుర్తించ లేని స్థితిలో దాడి చేయడానికి ప్రయత్నిస్తుంది. కొన్ని సంద ర్భాలలో వ్యాధిగ్రస్థ కుక్క లేదా జంతువు నిశ్శబ్దంగా ఉండి, అంటు డొక్కలు పడి, వెలుతురును కూడా చూడలేని స్థితిలో ఆహారం, నీరు తీసుకోకుండా ఏదైనా ఒక చీకటి లేదా మరుగు ప్రదేశంలో ఉండి దాదాపు వారంలో చనిపోతుంది. దీనినే ‘డంబ్ రేబీస్’ అంటారు. అలాగే మనుషులు పిచ్చికుక్క కాటుకు గురైన తర్వాత 2--3 నెలల నుండి ఏడాది లోపు ఎప్పుడైనా రేబీస్ లక్షణాలు కనపడవచ్చు. కొన్ని అరుదైన సందర్భాల్లో సంవత్సరం తర్వాత కూడా ఈ వ్యాధి సంక్ర మిస్తుంది. మనుషులు వ్యాధిగ్రస్థులు అయినపుడు కుక్క కాటు పడిన చోట దురద, మంట, జ్వరం మొదలవుతాయి. వ్యాధి ముదిరిన తర్వాత నీటిని చూస్తే గొంతు కండరాలు బిగుసుకుపోయి భయ పడటం (హైడ్రోఫోబియా), గాలి తగిలినా వణికిపోవడం (ఏరో ఫోబియా), తీవ్రమైన ఆందోళన వంటి నాడీ సంబంధిత సమస్యలు కనిపిస్తాయి. మనిషి గొంతుక మారిపోయి కుక్క వలె అరుస్తూ దాడి చేసేందుకు ప్రయత్నిస్తారు. చివరకు కోమాలోకి వెళ్ళి మరణిస్తారు.

### నీటుగా కడగటం అతిముఖ్యం

జంతువు కరిచిన వెంటనే గాయాన్ని ధారాళమైన నీటిధార (రన్నింగ్ వాటర్) కింద సబ్బుతో కనీసం 10 నుండి 15 నిమిషాల పాటు రుద్ది కడగాలి. సబ్బులోని క్షారగుణం వైరస్ పైపొరను నాశనం చేసి, వైరస్ తీవ్రతను దాదాపు 70--80 శాతం అక్కడే తుడిచి పెట్టేస్తుంది. అలాగే గాయంపై కారం, పసుపు, సున్నం, కాఫీ పొడి, ఆకుల పసర్లు వంటివి ఉపయోగించి తమకు తోచిన నాటువైద్యం చేయకూడదు. గాయంపై గట్టిగా కట్టుకట్టడం గానీ, వైద్యుడి సలహా లేకుండా వెంటనే కుట్లు వేయడం గానీ చేయరాదు. ప్రథమ చికిత్స అనంతరం పోవిడోన్ అయోడిన్ వంటి యాంటీ సెప్టిక్ ద్రావణాన్ని పూసి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి వెళ్లి టీకాలు వేయించుకోవాలి. ఇంట్రామస్కులర్ పద్ధతిలో 0, 3, 7, 14, 28వ రోజుల్లో మొత్తం ఐదు డోసులు ఇస్తారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందు బాటులో ఉన్న ఇంట్రాడెర్మల్ పద్ధతిలో 0, 3, 7, 28వ రోజుల్లో... మొత్తం నాలుగు మోతాదులుగా టీకాలు వేస్తారు. టీకాలు క్రమం తప్పకుండా వేయించుకోవడం ద్వారా మాత్రమే రేబీస్ నుండి రక్షణ పొందవచ్చు. దీని నిర్మూలన ఒక్క వైద్య, ఆరోగ్య శాఖతోనే సాధ్యం కాదు. పశు సంవర్ధక శాఖ, స్థానిక సంస్థలు, పెంపుడు జంతువుల యజమానులు, బ్లూ క్రాస్ తదితర జంతుసంక్షేమ సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. ఇళ్లలో పెంచు కునే కుక్కలు, పిల్లులకు వాటి యజమానులు మూడవ నెల వయసులోనే మొదటి మోతాదు రేబీస్ టీకా వేయించాలి. ఆ తర్వాత ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా బూస్టర్ డోస్ ఇప్పించి రికార్డులను భద్రపరచాలి. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా స్థానిక సంస్థలు గ్రామ, నగర స్థాయిలలో పెద్ద ఎత్తున ‘యానిమల్ బర్త్ కంట్రోల్’ (ఏబీసీ), సామూహిక రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి. వీధి కుక్కలను రాయితో కొట్టడం, వాటి ఆహారాన్ని కదిలించడం లేదా నిద్రిస్తున్నప్పుడు వాటిని భయపెట్టడం చేయకూడ దని పిల్లలకు స్పష్టంగా చెప్పాలి. జంతువుల ఆరోగ్యం, మానవ ఆరోగ్యం పరస్పరం ముడిపడి ఉన్నాయనే ‘వన్ హెల్త్’ విధానమే రేబీస్ రహిత సమాజానికి ఏకైక పరిష్కారం.

# మామ్2.. ఖుషికి అగ్నిపరీక్ష, లెగసీకి కొత్త అధ్యాయం



దాదాపు తొమ్మిదేళ్ల క్రితం రిలీజైన మామ్ మూవీ బాలీవుడ్‌లో భావోద్వేగ ప్రధాన చిత్రంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా శ్రీదేవి తన కెరీర్‌లో అత్యంత ప్రశంసలు అందుకున్న ప్రదర్శనగా ఈ సినిమా నిలిచింది. ఇప్పుడదే సినిమాకి సీక్వెల్ రూపంలో మామ్2 సెట్స్‌పైకి రావడంతో, ఫ్రాంచైజ్‌పై మళ్లీ ఆసక్తి పెరిగింది. అయితే ఈసారి ఫోకస్ పూర్తిగా కొత్త తరం వైపు మళ్లింది. లవ్ యాపా సినిమాలోని యాక్టింగ్ కు విమర్శలు మామ్2లో మెయిన్ లీడ్ గా శ్రీదేవి చిన్న కూతురు ఖుషీ కపూర్ కనిపించనుంది. ఇప్పటికే బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమెకు ఇది అత్యంత కీలకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు. ఖుషీ గత సినిమా లవ్ యాపా రిలీజ్ టైమ్ లో ఆమె యాక్టింగ్ పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. స్క్రీన్ ప్రెజెన్స్, ఎక్స్‌ప్రెషన్స్ విషయంలో ఇంకా ఇంప్రూవ్‌మెంట్ అవసరమని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మామ్2 ఆమె కెరీర్‌కు నిజమైన టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్న చర్చ మొదలైంది. భావోద్వేగంతో పాటు బలమైన న్యాయపరమైన కథనం ఉండే ఈ ఫ్రాంచైజ్‌లో ఆమె పెర్ఫార్మెన్స్ ఆడియన్స్ అంచనాలను అందుకోగలదా అన్నది ఆసక్తికరంగా మారింది.



### బోనీ కపూర్ ఎమోషనల్ డెసిషన్

ఇదే సమయంలో నిర్మాతగా బోనీ కపూర్ తీసుకున్న నిర్ణయం కూడా ప్రత్యేకంగా నిలుస్తోంది. తన భార్య కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన సినిమాకి సీక్వెల్ రూపొందించడం ఒకవైపు భావోద్వేగపూరిత నిర్ణయం అయితే, మరోవైపు వ్యూహాత్మక అడుగుగా కూడా చూడవచ్చు. మామ్ బ్రాండ్‌కు ఉన్న ఎమోషనల్ వాల్యూని కొనసాగిస్తూ, ఈ జెనరేషన్ హీరోయిన్ తో ఫ్రాంచైజ్‌ను విస్తరించాలనే ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం సీక్వెల్ మాత్రమే కాదు, ఒక లెగసీని కొత్త దిశలో నడిపించే ప్రయత్నం అని ఇండస్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

### పోలికలు తప్పవు

అయితే, ఈ ప్రాజెక్ట్ ముందున్న అతిపెద్ద సవాలు పోలికల ఒత్తిడి. శ్రీదేవి లాంటి లెజెండరీ నటి చేసిన సినిమాను ఇప్పుడు వేరే వారు చేస్తున్నప్పుడు కంపేరిజన్ ఆటోమేటిక్ గా వస్తుంది. ఆమె సృష్టించిన ఎమోషనల్ ఎఫెక్ట్ ప్రేక్షకుల మదిలో ఇంకా సజీవంగానే ఉంది. అలాంటి నేపథ్యంలో ఖుషి నటనను అదే ప్రమాణాలతో కొలవడం సహజం. ఫ్రాంచైజ్‌కు ఉన్న వారసత్వం ఒకవైపు బలం అయితే, మరోవైపు అదే అంచనాల భారంగా మారే అవకాశమూ ఉంది. కాబట్టి మామ్2 సక్సెస్ కేవలం గత జ్ఞాపకాలపై ఆధారపడదు. కథనం బలం, దర్శకత్వ దృష్టి, ముఖ్యంగా ఖుషి ప్రదర్శన.. ఈ మూడు అంశాలపై ఫలితం ఆధారపడనుంది. లెగసీని గౌరవిస్తూ, కొత్త అధ్యాయాన్ని విజయవంతంగా ప్రారంభించగలిగితేనే ఈ సీక్వెల్ నిజమైన అర్థంలో సక్సెస్‌గా నిలుస్తుంది. లేదంటే, ఇది కేవలం ఎమోషనల్ ఎక్స్‌పెరిమెంట్‌గానే మిగిలిపోవచ్చు.




# డిజిటల్ యుగంలో కమల్- రజినీ 'ఫిల్మ్' సాహసం!

తమిళ సినీ ప్రపంచంలో అత్యంత చర్చనీయాంశంగా మారిన కమల్‌హాసన్, రజినీకాంత్ రీయూనియన్ ప్రాజెక్ట్ ఇప్పుడు మరో ఆసక్తికరమైన మలుపు తీసుకుంది. ప్రస్తుతానికి ఖ×=ఖగా పిలుస్తున్న ఈ సినిమాను పూర్తిగా సంప్రదాయ ఫిల్మ్ కెమెరాలతో తెరకెక్కించే యోచనలో డైరెక్టర్ నెల్సన్ ఉన్నారన్న సమాచారం ఇండస్ట్రీలో పెద్ద చర్చకు దారితీసింది. డిజిటల్ ఆధిపత్యం కొనసాగుతున్న ఈ రోజుల్లో మళ్లీ ఫిల్మ్ రీల్స్ వైపు తిరగడం కేవలం టెక్నికల్ డెసిషన్ మాత్రమే కాదు, దాన్నొక వింటేజ్ స్టేట్‌మెంట్‌గా కూడా భావిస్తున్నారు. నాస్టాల్జిక్ మూడ్ ను తీసుకురావాలని ప్రయత్నం 80స్, 90స్ కాలంలో సినిమాలు పూర్తిగా ఫిల్మ్‌పై తెరకెక్కేవి. ఆ కాలపు విజువల్ టెక్స్చర్, నేచురల్ గ్రెయిన్, లైట్ ఫాల్ ఆఫ్, కలర్ డెప్త్.. ఇవన్నీ కలిపి ఒక ప్రత్యేకమైన నాస్టాల్జిక్ అనుభూతిని కలిగించేవి. అదే మూడ్‌ను తిరిగి స్క్రీన్‌పైకి తీసుకురావాలన్న ప్రయత్నంగా ఈ నిర్ణయాన్ని చూడొచ్చు. ముఖ్యంగా కమల్, రజనీ లాంటి లెజెండ్స్‌తో ఈ ప్రయోగం చేయడం ఆ జెనరేషన్‌కు ఒక భావోద్వేగ అనుసంధానాన్ని సృష్టించే అవకాశం ఉంది. అనుకున్నంత ఈజీ కాదు అయితే, ఈ వింటేజ్ ప్రయత్నం అంత సులభం కాదు. ఫిల్మ్‌పై షూటింగ్ అంటే ఖర్చు ఎక్కువ, ప్రతి షాట్‌కు పరిమిత అవకాశాలు, రీటేక్స్ ఖర్చు, అలాగే ప్రాసెసింగ్ టైమ్ నుంచే ఎన్నో సవాళ్లు ఉంటాయి. డిజిటల్‌లో లభించే ఇన్‌స్టంట్ మానిటరింగ్, ఈజీ ఎడిటింగ్ ఫ్లెక్సిబిలిటీ ఇక్కడ ఉండదు. పోస్ట్ ప్రొడక్షన్ దశలో కూడా సమయం, ఖచ్చితత్వం మరింత అవసరం అవుతుంది. ప్రస్తుత ప్రొడక్షన్ సిస్టమ్ బాగా



వేగవంతమైన నేపథ్యంలో ఈ విధానం ఎంతవరకు ప్రాక్టికల్‌గా ఉంటుంది అన్నది ఆసక్తికరంగా మారింది. ఇక సినిమాటోగ్రఫీ పరంగా చూసుకున్నా కూడా ఈ డెసిషన్ మరింత ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఈ మూవీకి సినిమాటోగ్రాఫర్ రాజీవ్ మెనన్ లాంటి వ్యక్తి ఫిల్మ్ ఫార్మాట్‌ను ఎంచుకుంటే, అది కేవలం స్టైల్ కోసం కాదని, ఒక ప్రత్యేక విజువల్ లాంగ్వేజ్ కోసమని అర్థం చేసుకోవచ్చు. ఫిల్మ్ కెమెరాల ద్వారా వచ్చే డైనమిక్ రేంజ్, స్కిన్ టోన్స్ సహజత్వం, లైట్ షాడో డెప్త్ ఈ సినిమాకు క్లాసిక్ విజువల్ టోన్‌ను ఇవ్వవచ్చు. ఇది సాధారణ కమర్షియల్ సినిమాల నుంచి భిన్నమైన అనుభూతిని అందించే అవకాశముంది. ఇక పాన్-ఇండియా కోణంలో చూస్తే, ఈ ప్రయోగం సక్సెస్ అయితే భారతీయ సినీ పరిశ్రమలో ఒక కొత్త చర్చకు నాంది కావచ్చు. డిజిటల్ వర్సెస్ ఫిల్మ్ అనే డిబేట్ మళ్లీ తెరపైకి రావచ్చు. ఇతర పెద్ద దర్శకులు కూడా హైబ్రిడ్ లేదా పూర్తి ఫిల్మ్ మోడల్‌పై ఆలోచించే పరిస్థితి ఏర్పడొచ్చు. అయితే, ఇక్కడే బజ్ వర్సెస్ రియాలిటీ ప్రశ్న ముందుకు వస్తుంది. ప్రారంభ దశలో ఫిల్మ్ కెమెరాలతో షూట్ చేయాలన్న ఆలోచన ఉన్నా, ప్రాక్టికల్ పరిమితుల కారణంగా చివరికి హైబ్రిడ్ మోడల్‌ను ఎంచుకునే అవకాశం కూడా లేకపోలేదు. భారీ అంచనాల నడుమ ఈ నిర్ణయం ఎంతవరకు అమలు అవుతుందన్నది చూడాల్సిందే. మొత్తంగా చూస్తే, కమల్-రజనీ రీయూనియన్ కేవలం స్టార్ పవర్ ఈవెంట్ మాత్రమే కాకుండా, భారతీయ సినీ సాంకేతికతలో ఒక వింటేజ్ ప్రయోగంగా నిలిచే అవకాశమున్న ప్రాజెక్ట్‌గా మారుతోంది. ఈ సాహసం ఎంతవరకు సక్సెస్ అవుతుందో రాబోయే రోజులు నిర్ణయించనున్నాయి.

# స్పెషల్ సాంగ్స్‌తో కెరీర్ రీ-స్టార్ట్ సాధ్యమేనా?



స్పెషల్ సాంగ్స్‌తో కెరీర్ రీ-స్టార్ట్ సాధ్యమేనా? పరిశ్రమలో స్పెషల్ సాంఘ్స్ ధోరణి గడిచిన కొన్నేళ్లలో పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు కెరీర్ చరమాంకంలో ఉన్న నటీమణులు డ్యాన్స్ ఆధారంగా అవకాశాలు పొందే నటీనటులకే పరిమితమైన పాటలు ఇప్పుడు స్టార్ హీరోయిన్ల కెరీర్‌కు ఊపిరిపోసే సాధనంగా మారుతున్నాయి. అవకాశాలు తగ్గినప్పుడు.. ఫ్లాప్‌లతో కెరీర్ మందగించినప్పుడు మళ్లీ లైమ్‌లైట్‌లోకి రావడానికి ప్రత్యేక గీతాలను రీ-స్టార్ట్ ఆయుధంగా మలచుకోవడం ప్రస్తుతం ఇండస్ట్రీలో ఓ వ్యూహంగా మారుతోంది. సమంత -ఊ అంటావా మావా-, తమన్నా -కావాలయా- వంటి గ్లోబల్ హిట్ పాటలు విప్లవాత్మక మార్పుకు ప్రత్యక్ష నిదర్శనాలు. ఒకప్పుడు ప్రత్యేక గీతాల్లో నర్తిస్తే కథానాయికగా అవకాశాలు తగ్గిపోతాయనే భయం ఉండేది. కానీ ప్రధాన పాత్రలతో రాని గ్లోబల్ ఇమేజ్ కోట్లాది మంది నెటిజన్ల దృష్టిని ఆకర్షించే సామర్థ్యం మూడు నిమిషాల పాటతో వస్తుండటంతో అగ్ర నటీమణులు సైతం గ్లామరస్ రీ-ఎంట్రీ కోసం ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. పరిశ్రమలో -స్క్రీన్ ప్రెజెన్స్- , -పబ్లిక్ మెమరీ- చాలా కీలకమైనవి. కొన్ని నెలల పాటు వెండితెరకు దూరమైతే ప్రేక్షకులు మరచిపోయే ప్రమాదం ఉన్న నేటి డిజిటల్ యుగంలో స్పెషల్ సాంగ్స్ తక్షణ ప్రచారాన్ని తెచ్చిపెడతాయి. సోషల్ మీడియా రీల్స్, యూట్యూబ్ ట్రెండింగ్స్ ద్వారా ఈ పాటలు ప్రతి ఇంటా మారు మోగిపోతాయి. దీంతో నటీమణుల క్రేజ్ మళ్లీ ఒక్కసారిగా శిఖరాగ్రానికి చేరుకోవడంతో పాటు ట్రేడ్ వర్గాల్లో కొత్త మార్కెట్ వాల్యూ ఏర్పడుతుంది. వ్యాపారాత్మక దృక్పథంతో చూస్తే ఈ నిర్ణయం హీరోయిన్లకు ఎంతో లాభదాయకంగా ఉంటోంది. తక్కువ రోజుల షూటింగ్ షెడ్యూల్‌లోనే భారీ పారితోషికం లభించడంతో పాటు, బ్రాండ్ ఎండోర్స్‌మెంట్లు, ఈవెంట్లలో అవకాశాలు వెల్లువెత్తుతాయి. పూర్తి స్థాయి సినిమాలో నటిస్తే వచ్చే బాక్సాఫీస్ గెలుపోటముల భారం ఈ పాటలపై ఉండదు. కేవలం డ్యాన్స్, గ్లామర్‌తో ప్రేక్షకులను మెప్పించి ఉనికిని మళ్లీ గట్టిగా చాటుకునే సౌలభ్యం ఇందులో ఉంది. అయితే స్పెషల్ సాంగ్స్ అనేవి కేవలం కెరీర్‌కు తక్షణ ప్రేరణ ఇచ్చే కెటలిస్ట్‌లు మాత్రమే తప్ప శాశ్వత విజయానికి గ్యారెంటీ కావు. ఈ నిర్ణయం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. సరైన వ్యూహం లేకపోతే ఐటమ్ గర్ల్ ముద్రపడి, కథానాయికగా ప్రాధాన్యత ఉన్న పాత్రలు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి వచ్చిన క్రేజ్‌ను పాటలకే పరిమితం చేయకుండా దాన్ని మంచి పర్ఫార్మెన్స్ ఆధారిత పాత్రలుగా మలుచుకోవడంలోనే అసలైన ప్రతిభ దాగి ఉంది. స్పెషల్ సాంగ్స్‌తో కెరీర్‌ను పునఃప్రారంభించడం లేదా వేగం పుంజుకోవడం ఖచ్చితంగా సాధ్యమే. ఇది సినీ పరిశ్రమలో మారుతున్న సమీకరణాలకు, హీరోయిన్ల వ్యాపార తెలివితేటలకు నిదర్శనం. కాకపోతే ఈ పాటలు తెచ్చిపెట్టిన తాత్కాలిక సంచలనాన్ని ఆసరాగా చేసుకుని మళ్లీ విలక్షణమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించినప్పుడే ఆ రీ-స్టార్ట్ పూర్తి స్థాయిలో విజయవంతమైనట్లు భావించొచ్చు.



# నయనతార న్యూ స్ట్రాటజీ 'బోత్ ఆర్ నాట్ సేమ్'!





నందమూరి బాలకృష్ణ -అఖండ-లో -మీరు చదివింది చట్టం..మేం నమ్మేది ధర్మం బోత్ ఆర్ నాట్ సేమ్ అన్నట్టు లేడీ సూపర్ స్టార్ నయనతార కొత్త స్ట్రాటజీని ఫాలో అవుతోంది. బాలకృష్ణ చెప్పిన డైలాగ్‌ని అక్షరాలా పాటిస్తూ అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. యావరేజ్ రేంజ్ ప్రొడక్షన్ హౌస్..భారీ ప్రొడక్షన్ హౌస్.. నా విషయంలో -బోత్ ఆర్ నాట్ సేమ్- అంటోంది నయన్. ఇంతకీ నయన్ ఫాలో అవుతున్న ఆ స్ట్రాటజీ ఏంటీ?..యావరేజ్ రేంజ్ ప్రొడక్షన్ హౌస్..భారీ ప్రొడక్షన్ హౌస్‌ల విషయంలో నయనతరాత ఏ స్ట్రాటజీని ఫాలో అవుతోంది. అసలు దీని వెనకున్న అసలు కథేంటన్నదే ఆసక్తిని రేకెత్తిస్తోంది. లేడీ సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న నయనతార స్టార్ హీరోలకు ఏ మాత్రం స్థాయి క్రేజ్‌ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. స్టార్ హీరోయిన్‌గా పాపులారిటీని దక్కించుకున్న నయన్ ఆ క్రేజ్‌కు తగ్గట్టే సినిమాలని ఎంచుకుంటోంది. లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తూనే అప్పుడప్పుడు స్టార్ హీరోలతో కలిసి భారీ ప్రాజెక్ట్‌లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తోంది. ఈ విషయంలోనే నయనతార తన పంథాను మార్చుకుని వ్యవహరిస్తోందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ప్రొడక్షన్ కంపనీ, భారీ స్పాన్ ఉన్న మూవీని బట్టి తన పారితోషికం విషయంలో మార్పులు చేస్తోందట. యావరేజ్ ప్రొడక్షన్ హౌస్ అయితే ఒక రేంజ్‌లో..అదే భారీ నిర్మాణ సంస్థ, సినిమా స్థాయిని బట్టి మరో రేంజ్‌లో పారితోషికం డిమాండ్ చేస్తూ నయనతార సరికొత్త స్ట్రాటజీని ఫాలో అవుతోందని తెలుస్తోంది. అయితే అన్ని సినిమాల విషయంలో ఈ పద్దతిని ఫాలో కావడం లేదని సినిమా స్థాయిని బట్టే పారితోషికంలో మార్పులు చేస్తోందని తెలిసింది. తెలుగులో ఈ ఏడాది సంక్రాంతి బరిలో నిలిచిన మెగాస్టార్ మూవీ -శివ శంకరవరప్రసాద్‌గారు-. ఇందులో చిరకు జోడీగా నయన్ నటించడం తెలిసిందే. అంతేనా.. అందరిని షాక్‌కు గురి చేస్తూ ఈ మూవీ ప్రయోషనల్ వీడియోల్లోనూ నటించింది. ఈ సినిమా విషయంలో నయన్ అంతగా ఇన్వాల్వ్ కావడానికి కారణం పారితోషికం అని తెలిసింది. ఈ సినిమా కోసం నయన్ రూ.6 కోట్లు తీసుకుందట. అందులో భాగంగానే ప్రమోషనల్ కంటెంట్‌లోనూ కనిపించి అందరిని ఆశ్చర్యపరిచిందట. ఇక చిరు సినిమాకు రూ.6 కోట్లు తీసుకున్న నయనతార రాకింగ్ స్టార్ యష్ -టాక్సిక్-కు వచ్చేసరికి ప్లాన్ మార్చేసింది. సినిమా బడ్జెట్, యష్ కున్న మార్కెట్, సినిమా స్థాయిని బట్టి రూ.12 కోట్లు డిమాండ్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నయనతార ఫాలో అవుతున్న ఈ కొత్త స్ట్రాటజీపై ఇప్పుడు కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే రాకింగ్ స్టార్ యష్‌తో కలిసి నయనతార నటించిన -టాక్సిక్- మార్చి 19న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే రోజు రణ్‌వీర్ సింగ్ -ధురంధర్ 2- కూడా రిలీజ్ అవుతుండటంతో రెండు సినిమాల్లో ఏది పై చేయి సాధిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# బోయపాటి శ్రీను కొత్త సినిమా.. స్టార్ హీరో గ్రీన్ సిగ్నల్

బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్ సినిమాలకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంటుంది. కానీ, రీసెంట్‌గా వీరి నుంచి వచ్చిన 'అఖండ-2' ఆశించినంత రేంజ్‌లో మెప్పించలేదు. ఈ మూవీ తర్వాత బోయపాటి శ్రీను తదుపరి చిత్రంపై ఇప్పటి దాకా ఎలాంటి క్లారిటీ రాలేదు. భారీ బడ్జెట్ చిత్రాలను చేసేందుకు ఇష్టపడే బోయపాటికి బలమైన మార్కెట్ ఉన్న హీరో దొరకాలి. ఒక సమయంలో అల్లు అర్జున్‌తో ఒక సినిమా తీస్తున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ, అది వర్కౌట్ కాలేదు. దీంతో బోయపాటి తన మనసుమార్చుకుని రానా దగ్గుబాటితో ఒక సినిమా తీయబోతున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రీ సమాచారం ప్రకారం, బోయపాటి తన రాబోయే చిత్రంలో ప్రధాన పాత్ర కోసం రానా దగ్గుబాటిని సంప్రదించాడని తెలుస్తోంది. చర్చలు ప్రారంభ దశలోనే ఉన్నాయని భావిస్తున్నప్పటికీ, ఇరువైపుల నుండి ఇంకా అధికారికంగా ధృవీకరణ రాలేదు. తన మార్క్ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్‌తో రానాను మెప్పించే ప్రయత్నంలో బోయపాటి ఉన్నట్లు సమాచారం. కమర్షియల్ యాక్షన్ చిత్రాల వైపు ఆసక్తి చూపిస్తున్న రానా కూడా.. ఈ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. బోయపాటి శ్రీను కొద్దిరోజుల క్రితం ముంబై వెళ్లిన విషయం తెలిసిందే. అట్లీ మూవీ షూటింగ్‌లో ఉన్న అల్లు అర్జున్‌ను కలిసి కథ కూడా చెప్పారట. బోయపాటి చెప్పిన కాన్సెప్ట్ బన్నీకి బాగా నచ్చిందని వార్తలు కూడా వచ్చాయి. అయితే, ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీతో సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత దర్శకుడు లోకేశ్ కనకరాజ్‌తో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ తర్వాత త్రివిక్రమ్‌తో ఒక సినిమాను లాక్ చేశాడు. ఆ వెంటనే పుష్ప-3 ఎటూ ఉంది. ఈ సినిమాలన్నీ పూర్తి కావలంటే కనీసం 4ఏళ్లు పడుతుంది. అందుకే బోయపాటి మరో కథను రెడీ చేసి రానాకు వినిపించారని తెలుస్తోంది



Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.